ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
# SHANMUKHAVELUGU వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 21 4
శుక్రవారం 14 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఏపీపీఎస్సీలో అక్రమాలు సిట్ నివేదికతో బట్టబయలయ్యాయి..

**జగన్ సమాధానం చెప్పాలి: మంత్రి డోలా**

**ఏపీపీఎస్సీ వ్యవహారంలో సిట్ నివేదికను బయటపెట్టిన మంత్రి డోలా**

**97.55 శాతం ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని నివేదికలో వెల్లడి**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 13)

ప్రైవేట్ రిసార్ట్‌లో, అనర్హులతో వాల్యుయేషన్ జరిపినట్లు గుర్తింపు యువతను మోసం చేసిన జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ తమ ప్రభుత్వం పారదర్శకంగా 16 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేసిందని స్పష్టీకరణఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, పాపాలు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదిక ద్వారా బట్టబయలయ్యాయని, వీటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి డిమాండ్ చేశారు. గురువారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ▶2లో

# అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 13)

అమరావతి: అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జిల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

"రాష్ట్ర విభజన తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నాం. రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం కాని పరిస్థితి. శివరామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. మరి భూములు కావాలి కదా? మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా" అని నాటి సంగతులను సీఎం వివరించారు.

### అమరావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు..

"సీడ్ యాక్సెస్ రహదారి ద్వారా రాజధానికి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నాం. అమ రావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు. నీటి సమస్య లేని ఏకైక రాజధాని అమరావతి. విద్యుత్ స్తంభాలు, వైర్లు కనిపించని ఆధునిక నగరమిది. గ్యాస్‌తో సహా అన్నీ భూగర్భం నుంచే వెళ్లే ▶2లో

## నేరస్తులను, అక్రమార్కులను పరామర్శించేందుకే జగన్ యాత్రలు చేపడుతున్నారు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 13)

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... సమాజంలో నేరాలు, అక్రమాలకు పాల్పడే వారిని పరామర్శించడానికే జగన్ ప్రత్యేక యాత్రలు చేపడుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై వైసీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, శాసనసభకు దూరంగా ఉండటం మాని వెంటనే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. జగన్ తాను అసెంబ్లీకి రాకపోవడమే కాకుండా, తన పార్టీ ఎమ్మెల్యేలను కూడా ▶2లో

## 'రీల్స్ యుగంలో' అడుగులు జాగ్రత్త

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 13)

అడ్డదారుల్లో వెళితే ఎదుగుదల కూడా మధ్యలోనే ఆగిపోతుందని జెన్ జీ యువతకు ప్రధాని మోదీ సూచించారు. జీవితంలో ముందుకుసాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. బుధవారం దిల్లీలో జరిగిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్; మై లైఫ్, మై స్ట్రగుల్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. కొందరు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు నడక వంతెనలు వాడకుండా రైల్వే ట్రాకులను దాటుతుంటారని, అలాంటివారి కోసం రైల్వేస్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు."ఇది రీల్స్ యుగం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు మిమ్మల్ని కొన్ని మార్గాల వైపు నడిపించవచ్చు. అవి అడ్డదారులైతే మీ ప్రయాణం మధ్యలోనే ఆగిపోతుంది. ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథలు చదవండి" అని సూచించారు. మాజీ రాష్ట్రపతి కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తు చేసుకున్నారు. జమిలి ఎన్నికలపై ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. చిన్నతనంలో కోవింద్ అగ్నిప్రమాదంలో తల్లిని కోల్పోయారని, ఆ విషాదం ఆయనను కుంగదీయకుండా మరింత దృఢంగా మార్చిందని తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రధానిగా తాను కోవింద్‌ను కలిసినపుడు ప్రోటోకాల్ పట్టించుకోకుండా కారు వరకు వచ్చి వీడ్కోలు పలికేవారన్నారు. అలా చేయవద్దని పలుమార్లు చెప్పినా.. కోవింద్ తన నిరాడంబరతను మాత్రం విడిచిపెట్టలేదన్నారు.




### నా గ్రామమే అన్నీ నేర్పింది: కోవింద్

"కాన్పూర్ గ్రామీణ జిల్లాలోని ఒక గ్రామం నుంచి నేను వచ్చాను. పరస్పరం ప్రేమ, కరుణలను చూపడం నేను నా గ్రామస్థుల నుంచే నేర్చుకున్నా. మా ఇంటి పైకప్పు నుంచి వాననీరు కారుతూ ఉంటే, వర్షం ఎప్పుడు ▶మిగతా 2లో

## సీడ్ యాక్సెస్ రోడ్డు.. నూతన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన చంద్రబాబు

**అమరావతిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 13)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. అమరావతి రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. రాజధాని కనెక్టివిటీని బలోపేతం చేసే లక్ష్యంతో మొత్తం రూ.1,519 కోట్ల భారీ వ్యయంతో 21.77 కిలోమీటర్ల పొడవున, 60 మీటర్ల వెడల్పుతో 9 లేన్ల రహదారిగా దీనిని రూపొం దిస్తున్నారు. విజయవాడ-మంగళగిరి హైవేను అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై 478 మీటర్ల పొడవునా ▶మిగతా 2లో

## అవయవదానంపై చైతన్యం పెంచాలి

**అవయవదాన దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు**

**అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని సూచన**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 13)

ఒకరి ప్రాణం నిలపడం ద్వారా మన జీవితానికి కొత్త అర్థం వస్తుందన్న పవన్ ప్రాణదానం చేసి, జీవితాలను కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి ప్రపంచ అవయవదాన ▶2లో

## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు.. వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

**ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో పాల్గొన్న పవన్ కల్యాణ్**

**దేశంలో ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కి పెరిగిందన్న డిప్యూటీ సీఎం**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 13)

ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ-ఏనుగుల సంఘర్షణ నివారణపై ▶2లో

## 'పంచధారల' వారసత్వ సంపదకు ముప్పు.. కేంద్రం జోక్యం చేసుకోవాలి

**రాజ్యసభలో పంచధారల మైనింగ్ అంశాన్ని లేవనెత్తిన వైవీ సుబ్బారెడ్డి**

**వారసత్వ కట్టడాల పరిరక్షణకు మైనింగ్ తక్షణం ఆపాలని డిమాండ్**

**కేంద్ర మంత్రులను కలిసి ఫిర్యాదు చేసిన వైసీపీ ఎంపీలు**

**అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణకు అభ్యర్థన**

**10 రోజుల్లోగా కేంద్ర బృందం పరిశీలిస్తుందని కేంద్ర మంత్రుల హామీ**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 13)

ఆంధ్రప్రదేశ్‌లోని పంచధారల వారసత్వ ప్రాంతం సమీపంలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వైసీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై పార్టీ సీనియర్ నేత, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం రాజ్యసభలో గళం విప్పారు. ప్రాచీన బౌద్ధ స్తూపాలు, ఆలయాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసు కోవాలని, మైనింగ్‌ను వెంటనే నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మినరల్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పంచధారలలోని బౌద్ధ క్షేత్రం, పురాతన ధర్మలింగేశ్వర స్వామి ఆలయానికి అతి సమీపంలో మైనింగ్ జరుగుతోందని ▶2లో

## ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి'.. రాజ్యసభలో రగడ.. నడ్డా ఏమన్నారంటే..!

**ఖర్గే సభ జరిగిన చోట శుద్ధీకరణ హోమం**

**రాజ్యసభలో ఖర్గే తీవ్ర అభ్యంతరం**

**ఘటన దురదృష్టకరమన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా**

**బీజేపీకి ఆ కార్యక్రమంతో సంబంధం లేదన్న నడ్డా**

**ఘటనపై విచారణ జరుపుతామని హామీ**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 13)

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో 'శుద్ధీకరణ' పేరుతో హోమం చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈ అంశం గురువారం రాజ్యసభను ▶2లో

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్ ను పరిశీలించిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

**80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 13)

పోలీస్ పరేడ్ మైదానంలో ఆగస్టు 15 న ఘనంగా జరిగే 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్ ను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. రిహార్సల్స్‌లో భాగంగా ముందుగా సిబ్బంది నుండి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకం ఎగుర వేశారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించి కవాత్ ను నిర్వహించడంలో కొన్ని సూచనలు, మెళుకువలు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు మరింత ఉత్సాహంగా కవాతు ప్రదర్శన చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ రోజున జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, తదితర వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, విద్యార్థులు, ప్రజలకు కల్పించాల్సిన భద్రత, సౌకర్యాలను సమీక్షించి, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచలను తెలియచేసారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) యన్ యుగంధర్‌బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఒంగోలు టు టౌన్ సీఐ వీర నాయక్, ఒంగోలు రూరల్ సీఐ శేషారిగిరావు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ హజరత్తయ్య, ఆర్ఐలు సీతారామిరెడ్డి, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొదటిపేజీ తరువాయి

# ఏపీపీఎస్సీలో అక్రమాలు సిట్ నివేదికతో బట్టబయలయ్యాయి..

సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిట్ నివేదికలో వెలుగు చూసిన వాస్తవాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని అన్నారు.సిట్ నివేదిక ప్రకారం, వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొన్న 158 మంది వాల్యుయేటర్లలో కేవలం 72 మందికి మాత్రమే అర్హత ఉందని, మిగిలిన వారంతా అనర్హులేనని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక వ్యవస్థను కాదని, ప్రైవేట్ జీమెయిల్ ఖాతాలు, వ్యక్తిగత ఐడీలు, డ్రైవ్‌ల ద్వారా వాల్యుయేషన్ నిర్వహించడం దారుణమని అన్నారు. అంతేకాకుండా, అభ్యర్థుల ఆన్సర్ షీట్లను ఓ ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించి, సీసీ కెమెరాలు గానీ, యూనివర్సిటీ నిపుణుల పర్యవేక్షణ గానీ లేకుండా 86 రోజుల పాటు అక్కడే ఉంచి మూల్యాంకనం జరిపారని ఆరోపించారు.

ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది (96.97 శాతం) ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని, మొత్తం 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తే 97.55 శాతం షీట్లలో దిద్దుబాట్లు కనిపించాయని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో వైట్నర్ వాడకం, సంతకాలు సరిపోకపోవడం, ఒకే పేపర్‌లో రెండు రకాల ఇంక్ వాడటం, చీఫ్ ఎగ్జామినర్ సంతకాలలో తేడాలు వంటి అనేక అక్రమాలు తేలాయని వివరించారు. ఇవి కేవలం సాంకేతిక తప్పిదాలు కావని, మెరిట్ ఉన్న అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకున్న చెలగాటమని మంత్రి మండిపడ్డారు.

ఈ అక్రమాలన్నింటికీ జగనే ప్రధాన బాధ్యుడని, యువతను, కోర్టులను తప్పుదారి పట్టించిన ఆయనకు రాజకీయాల్లో కొనసాగే నైతిక అర్హత లేదని డోలా అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా, అత్యంత పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన 16 వేల డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ నేతలు 240కి పైగా కేసులు వేసినా, చట్టబద్ధంగా అన్నింటినీ అధిగమించి డీఎస్సీని పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారు, ముందుగా సిట్ నివేదికలో తేలిన తమ అక్రమాలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం ప్రభుత్వం యువతకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతుందని, గతంలో జరిగిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నేరస్తులను, అక్రమార్కులను పరామర్శించేందుకే జగన్ యాత్రలు చేపడుతున్నారు

చట్టసభకు పంపకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

ఇదే సమయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగంపై మాట్లాడిన మంత్రి సత్యకుమార్... ప్రజలకు మెరుగైన ఉచిత, త్వరితగతిన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పీపీపీ విధానంలో అధునాతన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు.. వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు.

పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ–ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు.

అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘హనుమాన్’ కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డు.. నూతన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన చంద్రబాబు

నూతనంగా నిర్మించిన 4 వరుసల స్టీల్ బ్రిడ్జిని కూడా సీఎం ప్రారంభించారు. ఇది రాజధాని ప్రాంతానికి రాకపోకలను మరింత సులభతరం చేయనుంది.

సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమీపంలో అధికారులు, ఉద్యోగుల కోసం నిర్మించిన 9 టవర్లలోని 216 క్వార్టర్ల పనులన్నీ (ఇంటీరియర్స్ సహా) పూర్తయ్యాయి. అధికారులు వీటికి సంబంధించిన తాళాలను సీఎం చంద్రబాబు నాయుడికి అందజేయనున్నారు.

## ‘పంచధారల’ వారసత్వ సంపదకు ముప్పు.. కేంద్రం జోక్యం చేసుకోవాలి

సభ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణం గుండా ప్రవహించే ఐదు సహజ నీటి ప్రవాహాల వల్లే ఆ ప్రాంతానికి ‘పంచధారల’ అని పేరు వచ్చిందని, ప్రస్తుత మైనింగ్ కార్యకలాపాలతో ఆ పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వెంటనే తనిఖీలు చేపట్టాలని, పర్యావరణ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేయాలని, అన్ని అనుమతులను పునఃపరిశీలించాలని కోరారు. ఈ అధ్యయనాలు పూర్తయ్యే వరకు మైనింగ్‌ను నిలిపివేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఖనిజ సంపద ప్రజలదని, దాని నిర్వహణలో పారదర్శకత ఉండాలని సుబ్బారెడ్డి అన్నారు. మైనింగ్ విధానాలను రూపొందించేటప్పుడు రాష్ట్రాల ఆదాయానికి, స్థానిక ప్రజల జీవనోపాధికి, పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తుచేశారు.

అంతకుముందు, ఇదే అంశంపై వైసీపీ ఎంపీలు గొల్ల బాబూరావు, గుమ్మ తనూజారాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితరులు ఢిల్లీలో కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మైనింగ్, బ్లాస్టింగ్ వల్ల పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని అధికారిక విచారణలో తేలినట్లు వారు మంత్రులకు వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రులు.. పది రోజుల్లోగా ఒక కేంద్ర బృందాన్ని పంపి మైనింగ్ కార్యకలాపాలను పరిశీలిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ తనూజారాణి తెలిపారు.ఈ వ్యవహారంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తే సరిపోదని, అక్రమ తవ్వకాలకు నిబంధనల ప్రకారం సుమారు రూ. 250 కోట్ల జరిమానా విధించాల్సి ఉందని పేర్కొన్నారు. సీఎం రమేశ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన కోరారు.

## ఖర్గే సభ జరిగిన చోట ‘శుద్ధి’.. రాజ్యసభలో రగడ.. నడ్డా ఏమన్నారంటే..!

కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు.ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8న ఖర్గే ‘విజయ శంఖనాద’ సభ నిర్వహించారు. రెండు రోజుల తర్వాత శ్రీరామ్ సేనకు చెందిన కార్యకర్తలు అక్కడ హోమం చేసి వేదికను ‘శుద్ధి’ చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది.

రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ.. తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య పద్ధతేనా? రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు.ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్.. అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.ఖర్గే దళితుడు కావడంతోనే శుద్ధి చేశారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. దీనికి బీజేపీ రాష్ట్ర నేత ఖజన్ దాస్ స్పందించారు. ఖర్గే సభలో చేసిన కొన్ని నినాదాలు సనాతన వర్గాల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. రామ్‌లీలా మైదానం మతపరమైన ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని తెలిపారు.శుద్ధి కార్యక్రమంతో బీజేపీకి సంబంధం లేదని నడ్డా స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు.

## అవయవదానంపై చైతన్యం పెంచాలి

దినోత్సవం సందర్భంగా అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. అవయవాలను దానం చేయాలనే ఒక చిన్న నిర్ణయం మరొకరికి పునర్జన్మను ప్రసాదిస్తుందని, ఇది అత్యంత శక్తివంతమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.

అవయవదానం ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, తద్వారా మరింత మంది పౌరులు అవయవదాతలుగా మారేలా స్ఫూర్తిని నింపాలని పవన్ కల్యాణ్ కోరారు. “ఒక వ్యక్తి తన జీవిత కాలాన్ని పొడిగించుకోలేని స్థితిలో, మరొకరికి ప్రాణదానం చేయడం ద్వారా తన జీవితానికి ఒక సార్థకతను చేకూర్చుకోవచ్చు” అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రతి దానం ఒక నిరీక్షణకు భరోసా అని, ప్రతి దాత తమ మరణానంతరం ఒక గొప్ప వారసత్వాన్ని విడిచి వెళ్తారని పవన్ పేర్కొన్నారు. సమాజంలో అవయవదానం పట్ల ఉదారతను పెంపొందించే సంస్కృతిని అందరం కలిసి నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. “ప్రాణదానం చేయండి.. ఆశను నింపండి, జీవితాలను కాపాడండి” అంటూ తన సందేశంలో పేర్కొన్నారు.

## అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి

రాజధాని మన అమరావతి. ఇవాళ ప్రారంభించిన రోడ్డు చిన్న ట్రైలర్ మాత్రమే. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. రాష్ట్రాభివృద్ధిలో మొదటి మెట్టు ఎక్కాం. రాజధానితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ కావాలన్నదే అందరి సంకల్పం కావాలి. అమరావతి నిర్మాణం చేసి చరిత్ర సృష్టిస్తున్నందుకు గర్వంగా ఉంది” అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ‘రీల్స్ యుగంలో’ అడుగులు జాగ్రత్త

ఆగుతుందా అని మేము ఎదురుచూసేవాళ్లం” అంటూ రామ్‌నాథ్ కోవింద్ తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. సామాన్యులతోనూ మమేకమయ్యే మాజీ ప్రధాని వాజ్‌పేయీ, ప్రస్తుత ప్రధాని మోదీల పనితీరు తనపై చాలా ప్రభావం చూపిందని తెలిపారు. దృఢ సంకల్పానికి సజీవ నిదర్శనమైన కోవింద్ భారత దౌత్య సంబంధాలను ఎంతో బలోపేతం చేశారని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రశంసించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, పలువురు కేంద్ర మంత్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ కనెక్షన్లకు ఈకేవైసీ తప్పనిసరి ఆగస్టు 15 ఆఖరు తేదీ కనెక్షన్లు నిలిచిపోయే ప్రమాదం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 13)

అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఎల్పీజీ సేవలు అందేలా చూసేందుకు , అక్రమ వినియోగానికి చెక్ పెట్టేందుకు కేంద్ర పెట్రోలియం శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ-కేవైసీ ని సత్వరమే పూర్తి చేసుకోవాలని కరుణ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన గడువు మేరకు ఆగస్టు 15, 2026 లోగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశానుసారం తమ వివరాలను ధృవీకరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. గడువు దాటితే గ్యాస్ కనెక్షన్లను నిలిపివేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయిల్ కంపెనీ (ఇండియన్ ఆయిల్ వారి ఇండెన్ గ్యాస్ వారు ) మూడు సులువైన మార్గాలను అందుబాటులోకి తెచ్చాయన్నారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆయా గ్యాస్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారా ఇంట్లోనే ఉండి సులభంగా చేసుకోవచ్చని (లేదా) సిలిండర్ డెలివరీ సమయంలో ఇళ్లకు గ్యాస్ సిలిండర్ తీసుకొచ్చే డెలివరీ సిబ్బంది ద్వారా కూడా ధృవీకరణ పూర్తి చేసుకోవచ్చని (లేదా) నేరుగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియను ముగించుకోవచ్చని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వినియోగదారులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకొని, తమ గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ కేవైసీ పూర్తిచేసుకున్న వారు మరలా చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

# ఓ వ్యక్తి అవయవ దానం 8 మందికి పునర్జన్మను, 75 మందికి సంపూర్ణ ఆరోగ్యం

**డాక్టర్ దాసరి చంద్రశేఖర్**

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 13)

గురువారం ఉదయం ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్నని మనందరికీ తెలుసు, ఐతే ప్రాణ దానం అంతకంటే గొప్పదని, ఈ ప్రాణదానం కేవలం అవయవ దానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, ఒక వ్యక్తి అవయవ దానం చేయడం ద్వారా మరో వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించి దైవ సమానులు కాగలరని, కావున అవయవ దానమునకు సంబంధించిన అవగాహన ప్రతి ఒక్కరికి ఉండాలని, ఏటా మనదేశంలో ఐదు లక్షల పైగా జనాభా అవయవ దాన కొరతతో మరణిస్తున్నారని, గతంతో పోల్చుకుంటే నేడు మారుతున్న జీవనశైలి కారణంగా అనేక రకాల వ్యాధులతో గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, లివర్, ప్రేగులు మరియు ప్యాంక్రియాస్ వంటి ముఖ్యమైన అవయవాలు దెబ్బతింటున్నాయని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయవలసిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి వారి పేర్లను ఆన్లైన్లో వెబ్సైట్ ద్వారా అవయవ దాతగా నమోదు చేసుకోవచ్చునని, అవయవ దానం బ్రతికున్నప్పుడైనా లేదా చనిపోయిన తర్వాత కూడా చేయవచ్చునని, బ్రతికి ఉన్నప్పుడు ఆరోగ్యవంతుడైన మానవ దేహంలోని ఒక కిడ్నీ, పాక్షికంగా ఊపిరితిత్తులు, లివర్, పాంక్రియాస్ మరియు ప్రేగుల్లోని కొంత భాగాన్ని అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్వచ్ఛందంగా వైద్యుని సలహా మేరకు దానం చేయవచ్చునని, అలాగే మరణించిన తర్వాత మన దేహంలోని గుండె, ఊపిరితిత్తులు, లివర్, ప్యాంక్రియాస్, కిడ్నీలు, ప్రేగులు వంటి 8 రకాల అవయవాలను 4 నుంచి 24 గంటల్లోగా దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న 8 మందికి ప్రాణదానం చేసి పునర్జన్మను ప్రసాదించవచ్చునని, వీటితోపాటు మానవ దేహంలో ఉన్న ఇతర కణజాలైన చర్మం, ఎముకలు, టెండాన్లు, కంటిలోని కార్నియా పోర, గుండె కవాటాలు మొదలైనటువంటి వాటిని దానం చేయడం ద్వారా ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా ఆనారోగ్యంతో ఉన్న 75 మందిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చవచ్చునని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి స్వచ్ఛందంగా ముందుకొచ్చి అవయదానం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడడంలో తమ వంతు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల స్వచ్ఛంద సేవకురాలు కే నాగరాజ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



షణ్ముఖ
# తెలుగు
ప్రతి వార్త తెలుగు వైపు
తెలుగు దినపత్రిక
14.08.26 శుక్రవారం


# ఆగస్టు చివరి నాటికి నల్లమల సాగర్‌కు వెలిగొండ జలాలు

## రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

## రూ.318 కోట్ల ఆర్ అండ్ ఆర్ పరిహారం నేరుగా నిర్వాసితుల ఖాతాల్లో జమ

## అర్హులైన ఏ ఒక్క నిర్వాసితుడికి అన్యాయం జరగనివ్వం

## గ్రీవెన్స్ సెల్ ద్వారా ప్రత్యేక పరిష్కారం

## సాగు, తాగునీటితో పాటు పారిశ్రామికంగా, హార్టీకల్చర్ హబ్‌గా మార్కాపురం రూపురేఖలు మార్చడమే ధ్యేయం

## మార్కాపురం కలెక్టరేట్‌లో ప్రాజెక్ట్ పనుల పురోగతి పై ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 13)**

రాయలసీమ, ప్రకాశం జిల్లాల వర్షాభావ, ఫ్లోరైడ్ బాధితుల దశాబ్దాల కలను నెరవేరుస్తూ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి విడత (ఫస్ట్ ఫేజ్) పనులను పూర్తి చేసి ఈ ఆగస్టు చివరి నాటికే నల్లమల సాగర్‌కు నీటిని విడుదల చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

గురువారం మార్కాపురం కలెక్టరేట్‌లో వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతి, నిర్వాసితుల పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్) ప్యాకేజీ, మౌలిక వసతులు, ముంపు గ్రామాల ప్రజల తరలింపు పై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతలతో కలసి మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ కొల్లంవాగు వద్ద 80 వేల క్యూబిక్ మీటర్ల అత్యంత కష్టతరమైన మట్టి తొలగింపు పనులను పూర్తి చేసి ఛానల్‌ను సిద్ధం చేశారని మంత్రి తెలిపారు. గతంలో నిలిచిపోయిన వింగ్స్, సిసి వాల్స్ వంటి కాంక్రీట్ పనులను మే 2026 నాటికే విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలియజేశారు. టన్నెల్ 2లో మిగిలివున్న 7 కిలోమీటర్ల లైనింగ్ పనులను నాన్‌స్టాప్‌గా పూర్తి చేస్తూ, ప్రస్తుతం కేవలం 150 మీటర్ల బ్యాలెన్స్ పనులతో మొత్తం 19 కిలోమీటర్ల లైనింగ్ ముగింపునకు తీసుకురావడం జరిగిందన్నారు. 4.9 కిమీ బెంచింగ్ వర్క్ పూర్తయిందని స్పష్టం చేశారు.

11వ కిలోమీటర్ వద్ద ఏళ్లుగా చిక్కుకుపోయిన 1,900 మెట్రిక్ టన్నుల టిబిఎం, టివిఎం కోర్టు వివాదాలను పరిష్కరించి, కేవలం 60 రోజుల్లో 1,500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను క్లియర్ చేయడం జరిగిందని వెల్లడించారు. రూ.460 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఫీడర్ కెనాల్ పనుల్లో ఇప్పటికే 5.1 కిలోమీటర్ల జజ వాల్స్, 11 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

### నిర్వాసితుల సంక్షేమం – మానవీయ దృక్పథం (ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ)

నిర్వాసితులకు అందజేయాల్సిన ₹900 కోట్ల ప్యాకేజీలో భాగముగా ఇప్పటికే ₹318 కోట్ల నిధులను విడుదల చేసి, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి తెలిపారు. అవార్డు ప్రకటనలో సాంకేతిక పొరపాట్లు, పేర్ల నమోదులో తప్పులు, విలేజ్ వైడ్ వీడీఆర్ఎస్ కమిటీల ద్వారా వచ్చిన ఫిర్యాదులను 100% పారదర్శకంగా ఆన్‌లైన్ చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు.

### చుక్కల భూముల రైతులకు ఊరట

దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న చుక్కల భూముల రైతులకు రికార్డుల్లో ప్రభుత్వ భూమి అని ఉన్నప్పటికీ, మానవీయ కోణంలో ఆలోచించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేలా సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ▶4లో

# నిర్వాసితుల సహనాన్ని పరీక్షించిన మంత్రి నిమ్మల

## రాత్రి వరకూ కలెక్టరేట్ ఎదుట కొనసాగిన ఆందోళన

## భారీగా మోహరించిన పోలీసులు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 13)**

లక్షలాదిమంది ప్రజల బాగు కోసం... వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం... త్యాగం చేసి సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వానికి మనసు రాలేదు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ విషయం పై చర్చించేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

మంత్రి నిమ్మల రామానాయుడు రాక విషయం తెలుసుకున్న ముంపు గ్రామాల నిర్వాసితులు వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసిత పోరాట సంఘం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మార్కాపురం కలెక్టరేట్ వద్దకు ఉదయమే చేరుకున్నారు. మధ్యాహ్నం సమయానికి వందలాదిగా గుమికూడారు. సాయంత్రం 4 గంటల తరువాత మంత్రి నిర్మల రామానాయుడు మార్కాపురం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సమావేశం ముగిసిన తర్వాత వచ్చి మాట్లాడుతానని చెప్పడంతో నిర్వాసితులంతా వేచి ఉన్నారు. రాత్రి 8 గంటల సమయం అవుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు మాత్రం బయటకు రాలేదు. నిర్వాసితుల సహనాన్ని ▶మిగతా 4లో

# ఒంగోలు నగరం... త్రివర్ణ శోభితం..

## జాతీయ పతాకాన్ని చేబూని ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

## స్వాతంత్ర్య సమర స్ఫూర్తితో మరింత అభివృద్ధి దిశగా పయనిద్దాం

## జిల్లా కలెక్టర్ రాజాబాబు పిలుపు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 13)**

జిల్లా కేంద్రమైన ఒంగోలు త్రివర్ణ శోభితమయింది. గురువారం ఉదయం విద్యార్థులు, వివిధ శాఖల ప్రభుత్వ సిబ్బంది, ప్రజలు, స్థానిక ప్రముఖులు సుమారు 3వేల మంది జాతీయ పతాకాలను చేతబూని చేపట్టిన ర్యాలీతో ట్రంక్ రోడ్ కిక్కిరిసింది. వివిధ యూనిఫారాలు ధరించి ప్రకాశం భవనం నుంచి మినీ స్టేడియం వరకు జరిగిన మారథాన్ ర్యాలీ, వందేమాతరం నినాదాలతో సాగింది. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి నేతృత్వంలో సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో దేశ భక్తిని పెంచి స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని నింపింది. మినీ స్టేడియంలో ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే నేటి మన స్వతంత్ర భారతదేశం అన్నారు. ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. అన్ని రంగాలలో దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ▶4లో

# ఎన్టీఆర్ అంటే మూడక్షరాల పేరు కాదు

- తెలుగుజాతి ఆత్మ గౌరవ ప్రతీక
- విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలతో పేదల గతిని మార్చిన మహనీయుడు ఎన్టీఆర్
- పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, పక్కా ఇళ్లు, జనతా వస్త్రాలు, ఆస్తిలో మహిళలకు సమాన వాటా ఎన్టీఆర్ ఘనతే
- దామచర్ల ఆంజనేయులు ఈ ప్రాంతానికి చేసిన సేవలు చిరస్మరణీయం
- రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం సుస్థిర కాలం ఉండాలి
- మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఆగస్టు 13)**

ఎన్టీఆర్ అనేది మూడక్షరాల పేరు కాదు అది తెలుగుజాతి ఆత్మ గౌరవ ప్రతీక అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం జరుగుమల్లి మండలం దావగూడూరులో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి మంత్రి డాక్టర్ స్వామి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ఆవిష్కరణ అనంతరం పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో మంత్రి డిఎస్ బీవీ స్వామి మాట్లాడుతూ ఎన్టీఆర్ అనేది మూడక్షరాల పేరు కాదు అది తెలుగుజాతి ఆత్మ గౌరవ ప్రతీక. తెలుగు జాతి శక్తిని దశ దిశలా చాటి చెప్పిన మహనీయులు ఎన్టీఆర్. విప్లవాత్మకమైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు తీసుకొచ్చి పేదల గతిని మార్చిన మహనీయుడు ఎన్టీఆర్. పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, పక్కా ఇళ్లు, జనతా వస్త్రాలు, ఆస్తిలో మహిళలకు సమాన వాటా వంటి విప్లవాత్మక నిర్ణయాలతో ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. ఎన్టీఆర్ సినీ రంగంలో ఉన్నా, రాజకీయ రంగంలో ఉన్న ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారు.తెలుగుజాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ కీర్తి అజరామరంగా వెలుగుతూనే ఉంటుంది. ఆంజనేయులు ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం. ఈ ప్రాంతంలో దామచర్ల ఆంజనేయులు చేసిన అభివృద్ధి నేటికీ మన కళ్ళ ముందు కనిపిస్తోంది. కొండపి ▶మిగతా 4లో



# వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌లో గురువారం రాత్రి 11గంటలకు జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు...

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 13)**



# 11సీట్లకే పరిమితమైన వారికీ ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారు?

## చట్టం ఏం చెబుతుందో ముందు తెలుసుకోండి

## మీరు ఎలాగు ఉద్యోగాలు ఇవ్వలేదు, మేమిస్తే బురద చల్లుతారా

## సమస్యలు ఏవైనా అసెంబ్లీలో మాట్లాడండి....రోడ్ల పైన కాదు

## ఎన్టీఆర్‌తో కలిసి పని చేయటం పూర్వజన్మ సుకృతం

## దేశంలోనే యంగెస్ట్ మినిస్టర్‌గా పని చేసిన ఘనత నాదే

## అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

# ఆగస్టు చివరి నాటికి నల్లమల సాగర్‌కు వెలిగొండ జలాలు

ఆగస్టు నాటికే నీటి విడుదల ఎందుకు?

ప్రస్తుతం శ్రీశైలంలో 870 అడుగుల వద్ద నీటి మట్టం అందుబాటులో ఉందని, వెలిగొండకు నీళ్లు రావాలంటే కనీసం 855 అడుగుల లెవెల్ ఉండాలని మంత్రి వివరించారు. ఈ అనుకూల సమయాన్ని వినియోగించుకుని రోజూ 1 ుటీజ చొప్పున తొలి విడతగా 10 నుండి 15 రోజుల్లో దాదాపు 10 ుటీజల నీటిని నల్లమల సాగర్‌కు మళ్లించాల్సి ఉందన్నారు. ఈ అవకాశం చేజారితే మళ్లీ నీటి విడుదల ఏడాదికి పైగా ఆలస్యమై, తీవ్ర వర్షాభావంలో ఉన్న ప్రకాశం జిల్లాలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని, ప్రజలు మరియు నిర్వాసితులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని కోరారు.

ప్రాంతీయ అభివృద్ధి – పారిశ్రామిక, హార్టీకల్చర్ హబ్

వెలిగొండ నీళ్లు రావడం వల్ల కేవలం సాగు, తాగునీటి సమస్య తీరడమే కాకుండా, హైదరాబాద్ సమీపంలో ఉన్న మార్కాపురం ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రపోజల్స్‌లో ఉన్న ₹20,000 కోట్ల రాయలసీమ హార్టీకల్చర్ మిషన్‌లో ప్రకాశం జిల్లాలోని మార్కాపురం ప్రాంతాన్ని కూడా చేర్చి సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా, ఇరిగేషన్ అడ్వైజర్ ఎం వెంకటేశ్వరరావు, వెలిగొండ ప్రాజెక్ట్ సీఈ రమేష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల సహనాన్ని పరీక్షించిన మంత్రి నిమ్మల రాత్రి వరకూ కలెక్టరేట్ ఎదుట కొనసాగిన ఆందోళన

పరీక్షిస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓ దశలో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీస్ అధికారుల ద్వారా కొందరిని లోపలికి మంత్రి పిలిపించుకోవడం జరిగింది. అక్కడ జరిగిన చర్చల్లోనూ సానుకూలత కనపడలేదు. అంతా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకోవాల్సిన నిర్ణయమని కొట్టిపారేశారు. కనీసం సమయం ఇవ్వకుండా అందరికీ ప్యాకేజీ చెల్లించకుండా మిస్సయిన వారి పేర్లు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో చేర్చకుండా, 2026 నాటికి 18 ఏళ్లు నిండిన యువతి, యువకుల ప్యాకేజీ సంగతి కూడా తేల్చలేదు. సుమారు 7000 మందికి పునరావాసం కూడా లేకుండా వెలుగొండ ప్రాజెక్టు నీటిని ఎలా విడుదల చేస్తారని నిర్వాసితులు ఓవైపు నిలదీశారు. కానీ మంత్రి నిమ్మల రామానాయుడు కనీస కనికరం చూపలేదని వారు వాపోయారు. ఆందోళనకారులకు సమాధానం చెప్పే ధైర్యం లేక మంత్రి నిమ్మల రామానాయుడు రాత్రి వరకు కలెక్టరేట్లోనే ఉండిపోయారని నిర్వాసితులు తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. ఈ ఆందోళనకు మద్దతుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య పాల్గొనగా సిపిఎం మార్కాపురం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి, డీకేఎం రఫీ, తదితరులు నిర్వాసితులకు మద్దతుగా మాట్లాడారు.

## 11సీట్లకే పరిమిత అయ్యిన వారికీ ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారు?



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 13)

కేవలం 11 సీట్లకే ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందని, అది స్పీకర్‌గా నేను ఇచ్చేది కాదని, చట్టం ఎలా ఉంటే అలా చేసే వ్యక్తిని మాత్రమేనని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అయ్యన్నపాత్రుడు గురువారం ఒంగోలు విచ్చేశారు. ఒంగోలు వచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ పెట్టి వైసిపి ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదని, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇస్తే ఎందుకు అక్కసు వెళ్లగకుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికే 13 వేల మంది ఉద్యోగాలలో చేరారన్నారు. మరో మూడు నెలల్లో మరో డీఎస్సీ రాబోతుందన్నారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు రాని బాధితులు ఎవరు బయటకు వచ్చి మాట్లాడటం లేదన్నారు. ఉద్యోగాలు వచ్చినవారు తాము ఎంత పారదర్శకంగా ఉద్యోగాలు పొందామో మరోవైపు చెప్తున్నారన్నారు. అయితే దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ పై వైసిపి బురద చల్లేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ఏమైనా సమస్యలు ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించాలని, వారి ప్రశ్నలకు లోకేష్ ద్వారా సమాధానం ఇప్పించే బాధ్యత తనదే అన్నారు. అసెంబ్లీకి రాకుండా రోడ్లపై మాట్లాడటం సరికాదన్నారు. అసలు అసెంబ్లీకి రాని వారు జీతాలు ఎందుకు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు. అలాగే సీటింగ్ చార్జీలు కూడా తీసుకుంటున్నారని విమర్శించారు. ఇది న్యాయమా, ధర్మమా అని ప్రశ్నించారు. స్వర్గీయ ఎన్టీఆర్‌తో కలిసి పని చేయటం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. తనకు రాజకీయ బిక్ష పెట్టిన దేవుడు ఎన్టీఆర్ అన్నారు. 24 సంవత్సరాల ఉన్న వయసులోనే తనను పిలిచి ఎమ్మెల్యే సీటు ఇచ్చారన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా, ఒకసారి ఎంపీగా విజయం సాధించాను అన్నారు. దేశంలోనే అతి చిన్న వయసులోనే మంత్రిగా పనిచేసిన ఘనత తనదేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ మారిటైం బోర్డు దామచర్ల సత్య, టిడిపి దర్శి నియోజకవర్గ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ అంటే మూడక్షరాల పేరు కాదు

నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని సులభతరం చేశారు. ఈ ప్రాంతంలో దశాబ్దాల తరబడి ఉన్న సమస్యలకు దామచర్ల ఆంజనేయులు పరిష్కారం చూపించారు. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో పెద్దాయనగా దామచర్ల ఆంజనేయులు చిరస్థాయిగా నిలిచిపోయారు.సీఎం చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ ఆశయాలకనుగుణంగా పాలన సాగిస్తూ రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. వెలిగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం చేసి జగన్ ప్రజలను మోసం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధ ప్రాతిపదికన వెలుగొండ పనులు పూర్తి చేసి ఈనెలాఖరులో ప్రారంభిస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ హామీలన్నీ అమలు చేస్తున్నాం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం సుస్థిర కాలం ఉండాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## ఒంగోలు నగరం... త్రివర్ణ శోభితం..

మరింత సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రతి ఒక్కరం ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించుకుని వికసిత భారత్, స్వర్ణాంధ్ర – 2047 లక్ష్యాలకు అనుగుణంగా తమ వంతు బాధ్యత నిర్వహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చురుకైన పాత్ర పోషించాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్య పోరాట విలువలను భావితరాలకు తెలిపేలా ఐదు రోజులపాటు హర్ ఘర్ తిరంగా, సెల్ఫీ, మొక్కలు నాటడం, తిరంగా ర్యాలీలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి ఒక్కరూ వీటిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దిశగా పాల్గొంటామంటూ ఈ ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ మారథాన్ ర్యాలీలో డీఆర్వో పివి రమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిఆర్డిఏ పిడి నారాయణ, డీఈవో రేణుక, డ్వామా పిడి జోసఫ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఐసిడిఎస్ పిడి పద్మ సునంద, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, స్టెప్ సీఈవో రమణ, జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి రవికుమార్, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిటిసి సుశీల, డిఎస్పీ శ్రీనివాసరావు, ఏపీఎస్ఆర్టీసీ సూపర్వైజర్ ఫణి కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, డిఎస్డిఓ రాజరాజేశ్వరి, యువజన వ్యవహారాల అధికారి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్ కుమార్

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఆగస్టు 13)

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్‌కుమార్, కొనకనమిట్ల ఎసఐ శ్రీకాంత్‌లు అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రమైన కొనకనమిట్లలో గురువారం జాతీయ పండుగ విశిష్టత పై భారీ అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పొదిలి సీఐ రాజేష్, ఎసఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముప్పన్నెల జాతీయ జెండాలను చేత పట్టుకుని విద్యార్థులు చేసిన భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో వీధులన్నీ దేశభక్తితో పులకించాయి. విద్యార్థులతో పాటు సీఐ, ఎసఐ, పోలీస్ సిబ్బంది అడుగులు వేస్తూ ర్యాలీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా

# బాధిత కుటుంబానికి భీమా చెక్కు అందజేత రికార్డు స్థాయిలో త్వరితగతిన పరిహారం అందజేస్తున్న యూనియన్ బ్యాంకు

(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, ఆగస్టు 13)
దుద్దుకూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ చైతన్య ఆధ్వర్యంలో గురువారం దుద్దుకూరు గ్రామానికి చెందిన సారెకొక్కు సుబ్బారావు కుటుంబ సభ్యులకు ఆ బ్యాంకుకు చెందిన ఇండియా ఫస్ట్ లైఫ్ భీమా చెక్కు అందజేశారు. ఇటీవల సారెకొక్కు సుబ్బారావు మరణించగా అతని కుటుంబ సభ్యులు ఈ నెల 7వ తేదీన క్లెయిమ్‌కు దరఖాస్తు చేయ్యాగా నాలుగు పని దినాల వ్యవధిలోనే, కుటుంబ సభ్యులకు భీమా చెక్కు అందించినట్లు చైతన్య తెలిపారు. ప్రతి కుటుంబం బీమా చేయించుకోవడం అవసరమని సూచించారు. పాలసీ తీసుకున్న సారెకొక్కు సుబ్బారావు మృతి చెందడం బాధాకరమని, నామినీకి క్లెయిమ్ మొత్తాన్ని త్వరితగతిన అందజేసి బ్యాంకు తన బాధ్యతను నెరవేర్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి సుబ్బారావు, బి వేణు, జి ప్రసాద్, ఎన్ మనోజ్ కుమార్, ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత జడ్జి బి రూపశ్రీ

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 13)
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కోర్టుల పరిధిలో ఆగస్టు 15వ తేదీకి ముందు నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం కనిగిరి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కనిగిరి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొక్కలు నాటి వాటి సంరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి బి. రూపశ్రీ మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రకృతి ప్రధాన ఆధారమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడంతో బాధ్యత పూర్తికాదని, వాటికి నిరంతరం నీరు అందిస్తూ సంరక్షించి పెద్దవిగా పెంచాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని రక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ టీమ్, పోలీస్ సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు, పారా లీగల్ వాలంటీర్లు, గుడ్ హెల్ప్ ప్రతినిధులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఘనంగా తిరంగా సైకిల్ ర్యాలీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 13)
హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జాతీయ జెండా మనందరి గర్వానికి ప్రతీక అని, దేశ ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. తిరంగా ర్యాలీలో అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు.హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత భావాన్ని మరింతగా పెంపొందించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, దేశ సమగ్రత, ఐక్యత, శాంతిభద్రతలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) యన్ యుగంధర్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఒంగోలు టు టౌన్ సీఐ వీర నాయక్ ఒంగోలు రూరల్ సీఐ శేషారిగిరావు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, ఆర్ఐలు సీతారామిరెడ్డి, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తిరంగా ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగష్టు 13)
స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం తిరంగా ర్యాలీని స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మువ్వన్నెల జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాతో స్వీయ చిత్రాలు తీసుకుని మురిసిపోయారు. దేశభక్తిని చాటుతూ విద్యార్థులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మువ్వన్నెల జెండాలతో పాఠశాల ప్రాంగణం దేశభక్తి వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థుల్లో జాతీయ భావాలను, దేశ సమైక్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు వీరణారాయణ తెలిపారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశ స్వాతంత్ర్యం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీలు సంపంగి సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, ఉపాధ్యాయులు సత్య రామారావు, వైఎల్ శ్రీనివాసులు, శ్రీకృష్ణ, మల్లిఖార్జున, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అండగా ఎమ్మెల్యే సాంబన్న అభయహస్తం

## ఒక్కరోజులోనే రూ.4 లక్షల సాయం అందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 13)
ఆ కుటుంబం కళ్లలో ఆందోళన... గుండెల్లో దిగులు. ఇంటిపెద్ద ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుంటే, ఏం చేయాలో పాలుపోని స్థితి. చికిత్సకు కావాల్సిన డబ్బు ఎక్కడి నుంచి తేవాలో తెలియని అయోమయం. ఇలాంటి కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచారు ఎమ్మెల్యే ఏలూరి. చిన్నగంజాం మండలం, చిన్నగంజాం గ్రామం సోపిరాలకు చెందిన గంట నాగరాజు కొంతకాలంగా అధిక రక్తపోటు, మూత్రపిండ వ్యాధి, హైపర్ కలేమియాతో బాధపడుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు ఆయనను గుంటూరులోని రమేష్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంటనే అత్యవసర చికిత్స చేయించాలని సూచించారు. ఇంటిపెద్ద ప్రాణం మీదకు వచ్చిందన్న భయం ఒకవైపు, శస్త్రచికిత్స ఖర్చు భరించలేని ఆర్థిక పరిస్థితి మరోవైపు కుటుంబాన్ని కుంగదీశాయి. ఏం చేయాలో తోచని స్థితిలో ఆ కుటుంబ సభ్యులు స్థానిక నాయకులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ను ఆశ్రయించారు. బాధిత కుటుంబం పడుతున్న వేదనను అర్థం చేసుకున్న ఆయన, ఆలస్యం చేయకుండా తక్షణమే ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్ఓసీ ద్వారా రూ.4 లక్షల చెక్కు ఒక్కరోజులోనే మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. డబ్బు లేక చికిత్స ఆగిపోతుందేమోనన్న భయంతో ఉన్న ఆ కుటుంబానికి, ఎమ్మెల్యే సాంబన్న చూపిన ఈ మానవత్వం కొండంత అండగా నిలిచింది. నిరుపేదల కష్టాల్లో వెంటనే స్పందించి, సకాలంలో సాయం అందించడంలో ఏలూరి చూపిస్తున్న చొరవను స్థానికులు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.

# ప్రతి ఇంటి పై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 13)
80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15 న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని చిన్నగంజాం సత్యం హై స్కూల్ ప్రిన్సిపాల్ నున్న హరనాథ్ బాబు అన్నారు. ఈ సందర్భంగా గురువారం సత్యం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.ఇ సందర్భంగా హరినాథ్ బాబు మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన సమరయోధుల త్యాగాలను మరువ వద్దని వారు చూపిన బాటలో విద్యార్థులు నడవాలని అన్నారు. ఈ ర్యాలీలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ఇందు పాల్గొన్నారు.

# త్వరలో వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి పేరు మీద ప్రత్యేక పూజలు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 13)
త్వరలో వెలిగొండ ప్రాజెక్టు జలాలు విడుదల సందర్భంగా ముద్దసానమ్మ గండి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేరు మీద మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తై, కృష్ణా జలాలు త్వరలో మార్కాపురం ప్రాంతానికి రానున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంద సంవత్సరాలు ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా మార్కాపురం జిల్లాకు సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించి, రైతుల పొలాలకు సమృద్ధిగా నీరు చేరి మార్కాపురం ప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చన చేశారు. ఆఅనంతరం అమ్మవారి ఆశీస్సులు మార్కాపురం నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ అసాధ్యం అనుకున్న వెలిగొండ ప్రాజెక్టును సుసాధ్యం చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అయిన సందర్భంగా త్వరలో ఈ ప్రాంతానికి జలాలు రానున్న సందర్భంలో మార్కాపురం నియోజకవర్గంలోని ప్రతి దేవాలయాలు, మసీదులు, చర్చిలలో ప్రత్యేక పూజలు ప్రార్థనలు నిర్వహించాలని ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ మన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎంతో శ్రమటోర్చి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ప్రత్యేక జిల్లా సాధన, వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ విషయాన్ని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమైక్యస్ఫూర్తిని చాటిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ

## పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్, అధికారులు, నేతలు

## త్రివర్ణ పతాకాలతో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 13)**

కందుకూరు పట్టణంలో దేశభక్తి వెల్లివిరిసింది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించగా, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పలు రాజకీయ పార్టీల నేతలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమైక్యవాదాన్ని చాటిచెప్పారు. ఎల్ఐసి కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన సైకిల్ ర్యాలీలో గౌరవ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ కే అనూష, సిఐ అన్వర్ బాషా, తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చివరగా అందరి చేత దేశభక్తి ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఇంటింటా ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి త్యాగాలను గుర్తు చేసుకోవటంతో పాటు వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంతకుముందు పలు పాఠశాలల విద్యార్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మెప్మా సిబ్బంది, పొదుపు గ్రూపు మహిళలు, ఇంకా పలురా అనేక రంగాలకు చెందిన వారు జాతీయ జెండాలు చేతబట్టి, నినాదాలు చేసు కుంటూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నం వీరాస్వామి, పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, బిజెపి నాయకులు వరప్రసాదరావు, రాయపాటి శ్రీనివాసరావు, చనమాల శ్రీధర్, అన్న క్యాంటీన్ చైర్మన్ కొండలరావు, ఏఎంసి డైరెక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

### పోలీస్ పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

### 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 13)**

జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు గురువారం పరిశీలించారు.

ఈ సందర్భంగా పరేడ్ ప్రాంగణం, వేదిక నిర్మాణం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అధికారుల కూర్చునే ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. వేడుకలకు ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు హాజరు కానున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోలీస్ పరేడ్ రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ గారు పరిశీలించారు. ముందుగా గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనం ఎక్కి పోలీస్ బలగాల కవాతును పరిశీలించారు. పరేడ్ నిర్వహణలో పాటించాల్సిన క్రమశిక్షణ, కవాతు నిర్వహణలో మెళకువలు, బృందాల సమన్వయం తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. దినోత్సవ వేడుకలలో రెట్టించిన ఉత్సాహంతో కవాతు ప్రదర్శన చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఐ రమణారెడ్డి, మార్కాపురం టౌన్ ఎస్ఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞానజ్యోతి ముగింపు కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 13)**

అంగన్వాడీ కార్యకర్తల జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి 120 డేస్ శిక్షణ కార్యక్రమంలో బాగంగా మండలంలోని కడవకుదురు జేడ్పి హైస్కూల్ నందు జరుగుతున్న శిక్షణ తరగతుల కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన శిక్షణ కార్యక్రమంలో వికసిత భారత్ 2047 కార్యక్రమంలో బాగంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 100 సంవత్సరాలు పూర్తయ్యే నాటికి దేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే గొప్ప లక్ష్యంతో దేశాభివృద్ధిలోఅందరూ భాగస్వాములు కావాలని, దేశ పురోగతి కోసం చేయ్యవలసిన కృషి పై చర్చించారు. అంగన్వాడీ కేంద్రల బలోపేతానికి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కమ్యానిటి సహకారంతో తీసుకోని ఏలా బలోపేతం చేయ్యలో వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధికై ఇంగ్లీషు భాషాభివృద్ధి, సాంస్కృతిక, సృజనాత్మక పెంపు అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. తరగతి గదుల్లో బోధన ఉపకరణాల (టీఎల్ఎం) ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు ఏలా చెబుతారో అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అదే విధానం పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు వారికి టీఎల్ఎం, అర్ఎల్ఎం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఅర్పిలు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో, నైతిక విలువలతో మంచి లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తే విజయం

### జిల్లా విద్యాశాఖాధికారి సామ సుబ్బారావు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 13)**

వీరిశెట్టి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు ఆగమన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విద్యాసంస్థలు అధినేత మద్దుల శ్రీనివాసులు అధ్యక్షోపాన్యాసంలో కృషి, పట్టుదల లేని చదువు చుక్కాని లేని నావ వంటిదన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కాపురం జిల్లా విద్యాశాఖాధికారి సామ సుబ్బారావు ప్రసంగిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో నైతికత విలువలతో మంచి లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తే విజయం సాధించవచ్చునన్నారు. బిట్స్- బెల్లంకొండ విద్యాసంస్థలు కార్యనివాహక సంచాలకురాలు బెల్లంకొండ విజయలక్ష్మి ప్రసంగిస్తూ జీవితంలో ప్రతిక్షణానికి విలువ ఉంటుందనీ విద్యార్థులు సమయం వృధా చేయరాదన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు డిమాండ్‌కు తగ్గ కోర్సులను, బ్రాంచ్‌లను ఎంపిక చేసుకొని ఇష్ట పూర్వకంగా చదువుతే జీవితంలో త్వరలో స్థిరపడతారన్నారు. మండల విద్యాశాఖాధికారి బీవీ రెడ్డి ప్రసంగిస్తూ "సృష్టిలో తియ్యనైనది స్నేహం" అని విద్యార్థిదశలో మంచి స్నేహితులను ఎంపిక చేసుకొని, మంచిని గ్రహించాలన్నారు. యువత క్షణికావేశాలకు, చెడు వ్యసనాలకు లోనై తమ ఉజ్వల జీవితాలను నాశనం చేసుకోవొద్దని కోరారు. బిట్స్-బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ సంస్కారం లేని చదువు స్మశానంలోని శవంతో సమానమన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు కావలసింది అందం, డబ్బు, చదువు మాత్రమే పరమావధి కాదన్నారు. శీలం, సంస్కారం సుగుణ సంపద అని పేర్కొన్నారు. ప్రేరణ ఉపన్యాసకులు శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తూ ఆత్మ సౌందర్యం కన్నా, గులాబీ పరిమళం కన్నా వీరిశెట్టి ఆగమన వేడుకలు మిన్న అన్నారు. ఈ కిరణ్మయి వ్యాఖ్యతగా వ్యవహరించారు. డైరెక్టర్ కృష్ణంరాజు, డిగ్రీ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్స్ పి సత్య, వి వెంకటేశ్వర్లు ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అద్భుతంగా అలరించాయి. అధ్యాపకులు ఆర్ రాజేశ్వరరావు, జవ్వాజి శ్రీను, పి శ్రీను, ఎస్‌కే జాని, తదితరులు విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## స్వాతంత్ర్య స్ఫూర్తితో మార్మోగిన పొదిలి

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 13)**

పొదిలి ఎస్ఐ సూరెడ్డి రాజేష్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు చేతుల్లో త్రివర్ణ పతాకాలు చేతబూని అత్యంత ఉత్సాహంగా గురువారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉత్సాహంగా ప్రారంభమైన ఈ ర్యాలీ విశ్వనాథపురం వరకు అత్యంత వైభవంగా సాగింది. భారత్ మాతాకీ జై..వందేమాతరం అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో పొదిలి పట్టణం దేశభక్తి పారవశ్యంతో మార్మోగింది. ర్యాలీ అనంతరం ఆర్టీసీ డిపో కూడలి వద్ద పోలీసులు, విద్యార్థులు కలిసి మానవహారంగా ఏర్పడి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాలను, జాతీయ పండుగ ప్రాముఖ్యతను పెంపొందించేలా పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమంపై పొదిలి ప్రజలు విశేషంగా ప్రశంసలు కురిపించారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు దామచర్ల, ముత్తుముల

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

తిరుమలలోని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో గురువారం కలిసి స్వామి వారిని దర్శించుకొన్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు , గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు నియోజకవర్గ టిడిపి నాయకులు ఉన్నారు.

## జాతీయ జెండాతో సీఐ సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల సైకిల్ ర్యాలీ

### పట్టణ ప్రజలకు జాతీయ సమైక్యత, దేశభక్తి పై అవగాహన

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 13)**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గిద్దలూరు పట్టణంలో జాతీయ భావాన్ని చాటిచెప్పేలా భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీఐ కె సురేష్ ముఖ్య అతిథిగా హాజరై ఈ ర్యాలీని ప్రారంభించి స్వయంగా విద్యార్థులతో కలసి సైకిల్ తొక్కుతూ ముందుండి నడిపించారు. పట్టణంలోని పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో పట్టణ వీధులను హోరెత్తించారు. దేశ స్వాతంత్ర్య పోరాట త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రధాన రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీకి స్థానిక వ్యాపారులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
7 | 14.0826 శుక్రవారం

# ప్రతి ఇంటి పై త్రివర్ణ పతాకం ఎగరాలి

## బిజెపి తిరంగా కార్యక్రమం జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోనీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

దేశంలో స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఇంటిపై తిరంగా పతాకాన్ని ఎగురువేయాలని బిజెపి తిరంగా కార్యక్రమం జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోనీ పిలుపునిచ్చారు. స్థానిక విష్ణుప్రియ కన్వెన్షన్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిల్ ఆంటోనీ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఒక భారీ ర్యాలీ జరగనుంది. ఇందులో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలతో సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలన్నీ, వారి నాయకులు పూర్తి స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. దేశంలోని మిగతా ప్రాంతాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ కూడా 'తిరంగా యాత్ర' , ఇతర తిరంగా కార్యక్రమాలలో పూర్తిగా పాలుపంచుకుంటోందన్నారు. ఈ తిరంగా కార్యక్రమాలు మరియు త్రివర్ణ పతాకం గురించి మాట్లాడుకుంటున్నప్పుడు, ఇది కేవలం ఒక ఊరేగింపు లేదా కేవలం ఒక జెండా ఎగురవేయడం మాత్రమే కాదని,దీనికి అంతకంటే చాలా గొప్ప అర్థం ఉందన్నారు.మన భాష ఏదైనా, మనం ఏ ప్రాంతం నుండి వచ్చినా, మన మతం ఏదైనా, మన విశ్వాసాలు, నేపథ్యం ఏదైనా, మనం ఏ వృత్తిని ఎంచుకున్నా, మన వ్యక్తిగత ఆశయాలు ఏమైనప్పటికీ, మనందరికీ ఒక ఉమ్మడి బంధం ఉందని, మనమంతా ఏకతాటిపై ఉన్నామని, మన మధ్య జాతీయ సమగ్రత మరియు జాతీయ ఐక్యత ఉందని చెప్పే ఒక ప్రకటన ఇది అన్నారు. మనమంతా కలిసున్నాం, మనమంతా భారతీయులం, మరియు 'తిరంగా' అనేది మనందరినీ కలిపి ఉంచే ఒక ఉమ్మడి అంశం అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు ఒక సమయం ఉండేది, అప్పట్లో వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధులకు ఇలా త్రివర్ణ పతాకాన్ని చేతబట్టడం లేదా యాత్ర నిర్వహించడం అనేది కేవలం ఒక సుదూర కల మాత్రమే. ఈ జెండా పట్టుకున్నందుకు మాత్రమే అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు జైలుకు వెళ్లారు, ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు బాధలు అనుభవించారు మరియు కఠినమైన శిక్షలకు గురయ్యారన్నారు. దురదృష్టవశాత్తు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా, భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఇలాంటి ఆలోచనా విధానమే ఉన్న సందర్భాలు కొన్ని ఉన్నాయన్నారు. 2011లో కూడా, లాల్ చౌక్‌లో కొన్ని పౌర సమాజ సంఘాలు

తిరంగా యాత్ర చేయాలనుకున్నప్పుడు, ఆ సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు కొన్ని ప్రశ్నలు లేవనెత్తాయి. వారిలో కొందరు ఇప్పుడు ఇండియా అలయన్స్‌లో ఉన్నారు. అవన్నీ గతం. ఇప్పుడు దేశమంతా తిరంగా సంబంధిత కార్యక్రమాలలో పూర్తిగా పాలుపంచుకుంటోంది. ప్రస్తుత కాలంలో, ఇలాంటి యాత్రలలో పాల్గొనడానికి ఎవరికీ ఎలాంటి ఆంక్షలు లేవు. ఇప్పుడు, మన జాతీయ ఐక్యత, సమగ్రత కార్యక్రమాలన్నింటిలో యావత్ దేశం పూర్తిగా పాల్గొంటోంది. కానీ వీటన్నింటితో పాటు, భారతదేశం అంతటా అద్భుతమైన మార్పులు జరుగుతున్నాయి. మన పాత వలసవాద మనస్తత్వాన్ని మార్చే ఉద్దేశ్యంతో ఈ మార్పులు జరుగుతున్నాయి. చాలా కాలంగా, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా, మన దేశంలో చాలా మంది భారతదేశాన్ని మూడవ దేశం లేదా బాహ్య దేశాల దృష్టికోణంతో చూసేవారు. భారతదేశం ఇప్పుడు, అంతకంతకూ, మన సొంత దృష్టికోణంతోనే తనను తాను చూసుకుంటోంది. వలసవాద మనస్తత్వం నుండి విముక్తి పొందడాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రాథమిక నాగరికత లక్ష్యాలలో ఒకటిగా నిర్దేశించారు. ఆధునికత అనేది మన నాగరికతను మరచిపోయేలా చేయకూడదు. మరియు అభివృద్ధి అనేది మన వారసత్వాన్ని వదిలివేసేలా చేయకూడదు. భారతదేశం ఇప్పుడు చాలా కాలంగా, నిరంతరంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది. ఇది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కూడా సెమీకండక్టర్ల నుండి అంతరిక్షం, రక్షణ, ఆరోగ్య సంరక్షణ వరకు ప్రతి కీలక రంగంలో స్వావలంబన సాధించేందుకు భారతదేశం ఇప్పుడు కృషి చేస్తోంది. ఇవన్నీ చేస్తున్నప్పుడు కూడా, మనం మన ప్రాచీన భాషలను వేడుకగా జరుపుకుంటున్నాం. మన ప్రాచీన వ్రాతప్రతులను సంరక్షిస్తున్నాం. మనం అంతరిక్షాన్ని అన్వేషిస్తున్నప్పటికీ, వేలాది సంవత్సరాల నాటి మన నాగరికత పట్ల మనం గర్వంగా ఉన్నాం. పూర్తి భారతీయుడిగా ఉండటానికి, పూర్తిగా ఆధునికంగా ఉండటానికి మధ్య ఎటువంటి వైరుధ్యం లేదు. భారతదేశం తన చరిత్రను ఆలింగనం చేసుకునే విధానంలో, ఇటీవలి కాలంలో తీసుకున్న కొన్ని చర్యలలో ఈ నూతన విశ్వాసాన్ని మనం చూడవచ్చు. రాజ్‌పథ్ ఇప్పుడు 'కర్తవ్య పథ్'గా పేరు మార్చబడింది, ప్రజాస్వామ్యం అంటే కేవలం హక్కులు మాత్రమే కాదు, విధులను కూడా గుర్తుచేస్తుందని ఇది చాటి చెబుతోంది. తమిళనాడు రాష్ట్ర నాగరికతా సంప్రదాయాలను గౌరవిస్తూ కొత్త పార్లమెంటులో 'సెంగోల్'ను ప్రతిష్టించారు. నావికాదళ చిహ్నంలో వలసవాద సెయింట్ జార్జ్ క్రాస్‌ను తొలగించి, ఛత్రపతి శివాజీ మహారాజ్ వారసత్వ స్ఫూర్తితో రూపొందించిన కొత్త చిహ్నంతో రీడిజైన్ చేశారు. అండమాన్ నికోబార్ దీవులలో పేరులేని ఇరవై ఒక్క దీవులకు ఇప్పుడు భారతదేశపు 21 మంది పరమ వీర చక్ర అవార్డు గ్రహీతల పేర్లు పెట్టబడ్డాయి. ఢిల్లీలోని మన జాతీయ రాజధాని నడిబొడ్డున నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారీ విగ్రహం ఇప్పుడు నిలబడి ఉంది, ఒకప్పుడు అక్కడ కింగ్ జార్జ్ విగ్రహం ఉండేది. జాతీయ యుద్ధ స్మారక చిహ్నం (నేషనల్ వార్ మెమోరియల్) మన దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని ఇప్పుడు సగర్వంగా గౌరవిస్తోంది. భగవాన్ బిర్సా ముండా, మన గిరిజన వీరులను ఇప్పుడు 'జన్ జాతీయ గౌరవ్ దివస్' ద్వారా స్మరించుకుంటున్నాము. గురు గోవింద్ సింగ్ జీ సాహిబ్ జాదాల అసాధారణ త్యాగాన్ని 'వీర్ బాల్ దివస్' ద్వారా స్మరించుకుంటున్నాము. ఒక దేశం తన వీరులను స్మరించుకుంటుంది ఎందుకంటే తన వీరులను మరచిపోయే నాగరికత చివరికి తనను తానే మరచిపోతుంది. మన జాతీయ గర్వం కేవలం మన గతాన్ని గుర్తుంచుకోవడం వల్ల మాత్రమే రాదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, దేవానంద్, బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు శివారెడ్డి, బిజెపి జిల్లా ఇంచార్జ్ భరత్ కుమార్ యాదవ్, సురేష్, డి శివాజీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

---

# జ్ఞాన జ్యోతి పై అవగాహన

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 13)**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సిడిపిఓ బి సుశీల దేవి మాట్లాడుతూ 0-6 సంవత్సరాల పిల్లల ఎదుగుదల, మెదడు వికాసం, ఆటపాటలతో కూడిన బోధన పద్ధతులపై అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెలకువలను ఈ శిక్షణ ద్వారా అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే ఆర్ పి సి చంద్రశేఖర్, ఖాదర్, శ్రీనివాసులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్య సాయమే ప్రాణదానం ఎమ్మెల్యే ఏలూరి చొరవతో పేద కుటుంబానికి భరోసా

**(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, ఆగస్టు 13)**

యద్దనపూడి మండలం చింతపల్లిపాడుకు చెందిన హైమాల పెద్ద దానయ్య నిరుపేద కుటుంబీకుడు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. ఇలాంటి తరుణంలో ఆయనకు తీవ్ర కామెర్ల వ్యాధి, లివర్ సంబంధిత సమస్యలు తలెత్తడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే నరసరావుపేటలోని వెంకటేశ్వర నర్సింగ్‌హోంకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని, తక్షణమే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి ఆపరేషన్ ఖర్చు తలకుమించిన భారంగా మారింది. ప్రాణం మీదకు వచ్చిన తమవారిని ఎలా కాపాడుకోవాలో తెలియక కన్నీటి పర్యంతమయ్యారు. ఈ క్లిష్ట సమయంలో వారికి గుర్తొచ్చింది స్థానిక ఎమ్మెల్యే ఏలూరి. ఆయన్ను కలిసి తమ గోడు వెళ్లబోసుకోగా, బాధిత కుటుంబం పడుతున్న వేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. ఎల్‌వోసీ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,02,714 మంజూరు చేయించి, చెక్కును స్వయంగా అందజేశారు. ఆ చెక్కు ఆ కుటుంబానికి ప్రాణదానంలా మారింది. సకాలంలో అందిన ఈ సాయంతో దానయ్యకు నిరాటంకంగా శస్త్రచికిత్స చేయించుకునే వెసులుబాటు లభించింది. తమను ఆదుకున్న ఎమ్మెల్యేను తలచుకుంటూ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నేతలు ఆ చెక్కును అందజేశారు.

# ఘనంగా ప్రారంభమైన ఏపి 2026 బ్యాడ్మింటన్ పోటీలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో గురువారం యేనెక్స్ సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ 2026 బ్యాడ్మింటన్ అండర్ 19 ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం అండర్ 19 బాల బాలికల మెయిన్ డ్రా పోటీలను శిద్దా సుధీర్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి అంకమ్మ చౌదరి, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళి కృష్ణ, ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, కార్యదర్శి పి విజయ కృష్ణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు, అసోసియేషన్ ట్రెజరర్ అశోక్‌రెడ్డి, దండు శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

---

# అవయవ దానం పై కిమ్స్ హాస్పిటల్ అవగాహన కల్పిస్తూ 3 కె వాక్

## అవయవ దానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

ప్రపంచ అవయవ దానం దినోత్సవాన్ని పురస్కరించుకుని అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు ఆధ్వర్యంలో గురువారం 3 కె వాక్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన వాక్ ఎస్పీ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మెడికల్ విద్యార్థులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. ప్లకార్డులు, నినాదాలతో అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అవయవ దానంపై అవగాహన పెరిగితే మరింత మంది దాతలుగా ముందుకు వస్తారని, అవయవ దానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ అవయవ దానం ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఈ మహత్కార్యంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "జీవితాన్ని బహుమతిగా ఇవ్వండి- అవయవ దానం చేయండి" అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె అంకిరెడ్డి, టి శ్రీహరిరెడ్డి, టూ టౌన్ సీఐ వీర నాయక్, ట్రాఫిక్ సిఐ హజరత్తయ్యతో పాటు పలువురు కస్సల్టెంట్లు, వైద్యులు పాల్గొన్నారు.

# మండల నూతన కమిటీ

## అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాసిం, శ్రీనివాసరావు

### మండల నూతన కమిటీని ప్రకటించిన ఎమ్మెల్యే

### సమన్వయంతో పనిచేయాలి

### ఎమ్మెల్యే ఏలూరి

**(షణ్ముఖ వెలుగు, కారంచేడు, ఆగస్టు 13)**

తెలుగుదేశం పార్టీ కారంచేడు మండలం నూతన కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఖాసిం సాహెబ్, యార్లగడ్డ శ్రీనివాసరావు లు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కారంచేడు మండల తెలుగుదేశం పార్టీ నూతన

కమిటీని ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నూతన కమిటీ నాయకత్వంలో కారంచేడు మండలంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే ఏలూరి ఆకాంక్షించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు.

కారంచేడు మండల టీడీపీ నూతన కమిటీ ఇదే...

అధ్యక్షుడుగా షేక్ ఖాసిం సాహెబ్, ఉపాధ్యక్షుడుగా జవ్వాది లాజరు, ప్రధాన కార్యదర్శిగా యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గాజుల శ్రీహరి, భీమనేని మనోహర్, దండ వెంకటశివ, కార్యదర్శులు మాలెంపాటి కృష్ణారావు, నలపాటి యలమంద , షేక్ పీరుసాహెబ్, కోశాధికారి పాలపర్తి పోతురాజులు ఎన్నికయ్యారు.

---

# ప్రతిభ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 13)**

80వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్ కార్యక్రమంలో ఈరోజు ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జై భారత్, వందేమాతరం అనే నినాదాలతో పట్టణ ప్రజలను ఉత్తేజపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ మర్రి వెంకట్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదిలో పాఠ్యాంశాలతో పాటుగా, సామాజిక చైతన్యం, దేశం పట్ల గౌరవభావం పెంపొందించేటట్లుగా ఉపాధ్యాయులు ప్రేరణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మునిసిపల్ కమిషనర్ డి వేణుబాబు, మున్సిపల్ ఉన్నత సిబ్బంది,కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి, చైర్మన్ మారేపల్లి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు ఆంజనేయ శాస్త్రి, మస్తాన్ వలి పాల్గొన్నారు.

# 80 ఏళ్ల అగ్రకుల భారతంలో ఎండమావిగా మారిన దళితుల స్వాతంత్ర్యం

**మంత్రి గొట్టిపాటి ఇలాకాలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అరెస్టు చేసిన దర్శి డిఎస్పి అద్దంకి ఆర్డిఓలను సస్పెండ్ చేయాలి దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

80 ఏళ్ల స్వాతంత్ర అగ్రకుల భారతంలో దళితుల స్వాతంత్రం ఎండమావిగా మారిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆరోపించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద 80 ఏళ్ల స్వాతంత్ర భారతం–స్మశానాలు కూడా లేని దళితులు, సంక్షేమం, రక్షణ కోల్పోయిన దళితులు అనే అంశం పై పివి రావు మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ 1947 నాటి అర్ధరాత్రి స్వాతంత్ర అగ్రకుల స్వాతంత్రంగా మారిపోయిందన్నారు. బ్రిటిష్ వారు నుండి అధికారం భారతదేశ అగ్రకుల భూస్వామ్య వ్యక్తులకే దక్కిందన్నారు. స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు కావస్తున్న అంబేద్కర్ రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు అయినా కొద్దో గొప్ప రాజకీయ స్వాతంత్రం వచ్చిన అగ్రకుల మనువాద పార్టీల ఏజెంట్లుగా రిజర్వేషన్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కేంద్ర మంత్రులు మారిపోయారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు అధికార పార్టీ వాళ్లు చెప్పినట్టు మారి అధికార పార్టీల ఎజెండా అమలు చేస్తున్నారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులకు చట్టాలకు సంక్షేమ రాజ్యానికి అగ్రకుల పాలకులు తూట్లు పొడుస్తున్నరన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సబ్ సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా సంక్షేమానికి చాప చుట్టారన్నారు. ఈ రోజుకి దేశంలో రాష్ట్రంలో స్మశాన భూములు కూడా లేని దుస్థితిలో దళిత గిరిజనులు 80 ఏళ్ల స్వతంత్ర భారతంలో చీకటి పల్లెల్లో దారులు లేని గ్రామాలలో నీళ్లు లేని గూడేలలో జీవోత్సవాలుగా బ్రతుకుతున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు విద్యా ఉద్యోగాల్లో అమలు చేయకుండా ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆదాని అంబానీ లాంటి మోడీ కమలం చందాదారులకు అప్పగిస్తూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను మూసివేస్తున్నారన్నారు. పెరిగిన జనాభాకు అనుకూలంగా ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు పెంచకుండా మహిళా రిజర్వేషన్ బిల్లులో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మహిళలకు వాటా లేకుండా అగ్రకుల మహిళల ప్రయోజనాల కోసం పార్లమెంటులో మహిళా బిల్లు పెట్టటం ఈ దేశ ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళల స్వాతంత్రాన్ని హరించే మనువాద ఆర్ఎస్ఎస్ దళిత మహిళల చెవిలో "కమలం పువ్వులు" పెట్టడమేనన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఒక్క రూపాయి కూడా సబ్సిడీ రుణం ఇవ్వకుండా ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకు పెన్షన్లు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమ స్వాతంత్రాన్ని పరిహాసం చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు పార్లమెంటు చెప్పకపోయినా దళితులు పోరాడి సాధించుకున్న దళితుల వజ్రాయుధమైన ఎస్సీ ఎస్టీ యాక్ట్ కేసుల్లో అగ్రకుల నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి కూటమి ప్రభుత్వం అగ్రకుల అరాచక పాలన కొనసాగిస్తూ దళిత బాధితుల స్వాతంత్ర్యాన్ని హరిస్తూ దళితులను బానిసలుగా మార్చింది అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దేవత వస్త్రాలుగా మార్చి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్ఎస్ఎఫ్డిసి, ఎన్ ఎస్ కే ఎఫ్ డి సి, ఎన్ బి సి ఎఫ్ డి సి లాంటి పథకాల నిధులు నిరుద్యోగులకు ఇవ్వకుండా దళిత నిరుద్యోగుల అభివృద్ధిని కూటమి, కేంద్ర బిజెపి పార్టీలు దళితులను అనసి వేస్తున్నరన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా అగ్రకులాల మెప్పుకోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం అమలు చేస్తు దళిత విద్యావంతుల స్వాతంత్రాన్ని నిప్పులు పోసింది. బిజెపి ఓటమి ప్రభుత్వాలేనన్నారు. విద్యుత్ శాఖ మంత్రి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఇలాకాలోని జె పంగులూరు మండలం నూజిల్లపల్లి గ్రామంలో దళితులు ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని హుటాహుటిన పంగులూరు తాసిల్దార్ కార్యాలయంలో నిర్బంధించడం కూటమి ప్రభుత్వ కుల వివక్ష నిదర్శనమన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అరెస్టు చేసి పంగులూరు కార్యాలయంలో నిర్బంధించిన దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ, అద్దంకి ఇంచార్జి ఆర్డీవో జ్యోతి, విజయ కుమార్ లను సస్పెండ్ చేసి అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకునే స్వాతంత్రం దళితులకు ఉందని జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు నిరూపించాలని నీలం నాగేంద్రరావు కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, సామాజిక ఉద్యమకారుడు పాలేటి కోటేశ్వరరావు, పట్రా బంగారం, మేడికొండ మురళి, కరుణాకర్, గోపి, కోలా జీవరత్నం, తదితరులున్నారు.

# సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

ఒంగోలు నగరంలో సెప్టెంబర్ 1 చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఆగస్టు 5 నుండి 15వ తేదీ వరకు జరిగే ప్రచార యాత్రలో భాగంగా నగరంలో ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో మార్పు కావాలి–మార్పు రావాలని కోరుతూ దేశవ్యాప్తంగా దళిత గిరిజన రైతాంగ కార్మిక కర్షక వర్గాలు ఎదుర్కొంటు పలు సమస్యల పరిష్కారం కోసం జాతీయ పార్టీ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిత్యావసర ధరలు తగ్గించాలన్నారు. విద్య, వైద్యం పేదలకు అందుబాటులోకి తేవాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, బ్యాలెట్ పేపర్ల పద్ధతిలోనే ఎలక్షన్ నిర్వహించాలని కోరుతూ జరిగే చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలనీ కోరారు. పార్టీ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల టైమ్ లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు జేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో సీనియర్ నాయకులు సర్దార్, నగర సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, బోడపాటి సుబ్బారావు, నల్లూరి మురళి, ముత్తాన అంజయ్య, కైలా అజయ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దిగుమతి తగ్గించి, నాణ్యతను పెంచండి

**అనుమతి పొందిన పొగాకు విత్తనాలనే నారుమడుల్లో వాడండి**

**పశువుల ఎరువుల వాడకం ఎంతో శ్రేష్టం**

**పొగాకు బోర్డు సెక్రటరీ వేణుగోపాల్ పిలుపు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

తక్కువ దిగుబడితో నాణ్యమైన పొగాకును పండించడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని పొగాకు బోర్డు సెక్రెటరీ డి వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక పొగాకు బోర్డు రీజియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ ఏడాది 80 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతించింది అన్నారు. అందులో భాగంగా పొగాకు నారుమళ్లలో అనుమతి పొందిన పొగాకు విత్తనాలనే వాడటం ద్వారా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు. ఫెర్టిలైజర్స్ వాడకుండా పశు ఎరువులను వాడటం ద్వారా భూమి యొక్క సారవంతాన్ని మరింత పెంచవచ్చు అని పేర్కొన్నారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా కూడా భూమి మరింత సారవంతంగా మారుతుంది అన్నారు. కేవలం యుద్ధం కారణంగానే ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లలో సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులు కేవలం లో గ్రేడు బేళ్లనే వేలానికి తీసుకురాకుండా, అన్ని రకాల బేళ్లను తీసుకురావడం ద్వారా సరా సరి ధర మరింతగా పెంచుకోవచ్చని ఈ సందర్భంగా సూచించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 236 మిలియన్ కిలోలు పొగాకు నిల్వలు ఉండగా, కేవలం 56 మిలియన్ మాత్రమే కొనుగోలు జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో పొగాకు ఆర్ఎం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ అడ్మిషన్లలో బీసీలకు ద్రోహం జీవో 102ను తక్షణమే రద్దు చేయాలి

## మిరియం శ్రీనివాసులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కళాశాలల అడ్మిషన్ల కోసం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తాజాగా విడుదల చేసిన జీవో నంబర్ 102ను తక్షణమే ఉపసంహరించుకోవాలని గురువారం ఒంగోలు లోని 139 బీసీ కులాల జేఏసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ జీవో ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ అభ్యర్థులకు, ముఖ్యంగా బీసీ విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూర్చేలా కుట్ర పన్నిందని ఆయన మండిపడ్డారు. గతంలో 2019లో మాన్యువల్ అడ్మిషన్ల నుంచి ఆన్‌లైన్ విధానానికి మారినప్పుడు ఆప్షన్లు ఎంచుకునే ప్రక్రియలో రిజర్వేషన్ అభ్యర్థులకు నష్టం జరుగుతోందని కొందరు హైకోర్టును ఆశ్రయించారని మిరియం శ్రీనివాసులు గుర్తుచేశారు. అప్పట్లో హైకోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు సీనియర్ ఐఏఎస్ లు, ఇద్దరు సీనియర్ విద్యావేత్తలు, ఇద్దరు సీనియర్ హైకోర్టు న్యాయవాదులతో కూడిన ఆరుగురు సభ్యుల నిపుణుల కమిటీని నియమించారని తెలిపారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా 2020లో ప్రభుత్వం జీవో నంబర్ 151ను తీసుకువచ్చిందని వివరించారు. గత ఆరేళ్లుగా ఈ జీవో 151 ప్రకారమే అడ్మిషన్లు జరుగుతున్నాయని, దీనివల్ల ఓసీ అభ్యర్థులకు గానీ, రిజర్వేషన్ అభ్యర్థులకు గానీ ఎలాంటి నష్టం జరగకుండా ప్రక్రియ సాఫీగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న విధానాన్ని పక్కనపెట్టి, ఇప్పుడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కుట్రపూరితంగా జీవో 102ను తీసుకువచ్చి బీసీ అభ్యర్థులను దొంగదెబ్బ తీయాలని చూస్తోందని శ్రీనివాసులు విమర్శించారు. 2018లో కూడా చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు జీవో 550ని రద్దు చేసి బీసీ విద్యార్థులకు నష్టం చేయాలని చూస్తే, బీసీలంతా ఏకమై పోరాడి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో జీవో 102 ద్వారా బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తక్షణమే జీవో 102ను రద్దు చేసి, పాత విధానమైన జీవో 151 ప్రకారమే మెడికల్, డెంటల్ అడ్మిషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా రిజర్వేషన్ అభ్యర్థులకు నష్టం చేసేలా ముందుకు వెళితే, బీసీ మరియు రిజర్వేషన్ విద్యార్థులతో కలిసి తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని మిరియం శ్రీనివాసులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ

# పొన్నలూరులో హర్ ర్ తిరంగా ర్యాలీ

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 13)**

భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పొన్నలూరులో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు విద్యార్థులు త్రివర్ణ పతాకాలు చేతబట్టి ఉత్సాహంగా 'భారత్ మాతాకీ జై' అంటూ నినదించారు. దీనిలో భాగంగా ఎంపీడీవో సతీష్ బాబు మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని మేల్కొల్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని,జాతీయ సమైక్యతను ఇవి పెంపొందిస్తాయని ఆయన అన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి క్యాడెట్లకు రక్త పరీక్షలు

**ఎన్‌సిసి అధికారి డాక్టర్ మొర్రి పిచ్చయ్య**

**రాజు, సాయి పారామెడికల్ కాలేజీ సౌజన్యంతో బ్లడ్ టెస్టులు**

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 13)**

పట్టణంలోని పీఎంశ్రీ హై స్కూల్ ప్లస్ పాఠశాల వేదికగా ఎన్‌సిసి క్యాడెట్లకు ఉచిత రక్త పరీక్షల కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్థానిక 'రాజు, సాయి పారామెడికల్ కాలేజీ' సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్ బలరాం విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. కేవలం రక్త పరీక్షలు చేయడమే కాకుండా రక్త నమూనాలు సేకరించే విధానం, వాటిని ల్యాబ్‌లో పరిశీలించే ప్రత్యక్ష పద్ధతులను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఎన్‌సిసి విద్యార్థుల ఆరోగ్య శ్రద్ధను దృష్ట్యా ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించిన రాజు, సాయి పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు, కరస్పాండెంట్ శంకర్ లకు హెచ్ఎం సిద్దేశ్వరశర్మ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి డాక్టర్ మొర్రి పిచ్చయ్యతో పాటు కళాశాల సిబ్బంది శ్రీరామిరెడ్డి, పీరయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యత, సామాజిక ఐక్యత కోసం తిరంగారంగ్ ర్యాలీ

జాతీయ జెండాలతో కదం తొక్కిన బద్వేల్ బీజేపీ శ్రేణులు

కడప జిల్లా కో కన్వీనర్ కొలిశెట్టి పవన్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 13)

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బద్వేల్ నియోజకవర్గం తిరంగారంగ్ ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు.బద్వేల్ హైస్కూల్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీలో హైస్కూల్ విద్యార్థి, విద్యార్థినులు మానవహారం నిర్వహించారు. చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని భారత్ మాతా కీ జై నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో హర్గర్ తిరంగా కడప జిల్లా కో కన్వీనర్ కొలిశెట్టి పవన్ కుమార్, బీజేపీ కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు అన్నపురెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు ధర్మశెట్టి వెంకట సుబ్బయ్య రాయల్, బిజెపి జిల్లా సెక్రెటరీ కెవి రమణ, హైస్కూల్ హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక ఐక్యతను చాటిచెప్పేందుకు ఈ ర్యాలీ నిర్వహించాం అన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావన పెంపొందించాలి. ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగి దేశాభివృద్ధికి కృషి చేయాలి అని పిలుపునిచ్చారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 13)

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని, దళితులపై జరుగుతున్న దాడులను ఖండించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కంభం చెరువు కట్టపై దళిత క్రైస్తవుల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి షాలేం రాజు మాట్లాడుతూ.. దళిత క్రైస్తవుల హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే విధంగా 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చర్చికి వెళ్తే ఎస్సీ హోదా కోల్పోవాల్సి వస్తుందనే ప్రభుత్వ వాదన సరికాదని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రైస్తవ సమాజం పట్ల అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని కోరారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో మరింత బలమైన ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. త్వరలో మార్కాపురం జిల్లాలో వేలాది మంది క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో భారీ నిరసన కార్యక్రమానికి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ పోరాటానికి ప్రతి క్రైస్తవ సంఘం, పాస్టర్ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నేదరపల్లి జయరాజ్, గోన మోహనరావు, బుదాల ఆనంద్, భాస్కర్, నాగరాజు, క్రైస్తవ సంఘ పాస్టర్లు కొండేపోగు ప్రసన్నకుమార్, ఎం రత్నప్రభాకర్, దున్న ప్రసాద్, బాబు పులుకూరి, మరియాదాస్, ఆర్ జోషఫ్, మోటుకూరి షాలేం, మహిళా నాయకులు జయమ్మ, రాణెమ్మ, ప్రియాంక, రూతమ్మ, స్వర్ణ, శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మంది దళిత క్రైస్తవులు ఈ ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు.

# జవహర్ నవోదయ, ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షల పై
# ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 13)

విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను వెలికితీసి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష, నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఏ సుబ్బారెడ్డి అన్నారు. మార్కాపురం బాలికల ఉన్నత పాఠశాలలో మార్కాపురం జిల్లాలోని మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయుల కోసం ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఏ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 700 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు జవహర్ నవోదయ, చీవీమీ ప్రవేశ పరీక్షలపై విస్తృత అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ పోటీ పరీక్షలు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించడంతో పాటు, భవిష్యత్తులో ఉన్నత స్థాయి పోటీ పరీక్షలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో "మిషన్ నవోదయ" కార్యక్రమాన్ని 100

రోజుల పాటు సమర్థవంతంగా అమలు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో "మిషన్ ఎన్ఎంఎంఎస్" కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారికి నిరంతర మార్గదర్శకత్వం అందించాలని కోరారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయుడికి నిజమైన గౌరవం లభిస్తుంది అని ఆయన పేర్కొంటూ, ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల విజయాన్ని తన బాధ్యతగా భావించి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని కోరారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు పి శ్రీనివాసులు, జి సంజీవి, ఏసీ ఆర్ కొండారెడ్డి, డి రామిరెడ్డి, జవహర్ నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు రాందాస్ నాయక్, శార్వాణి, గిరిధర్‌శర్మ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, నరసింహారావు, పెద్దిరాజు, ఆంజనేయులు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ, ఎన్ఎంఎంఎస్ పరీక్షల కోసం విశేష కృషి చేస్తున్న కొంతమంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను సత్కరించారు. జిల్లాలో ఇలాంటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను అభినందించారు.

## రైతులు వర్షాభావ పరిస్థితులకు అనుకూలంగా
# పంటలు సాగు చేసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 13)

మండలంలోని సూదనగుంట, కుంచేపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం రైతులతో ఎల్‌నినో పరిస్థితుల మీద పాటించవలసిన సాగులోని మెళకువలు, జాగ్రత్తలు గురించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన పరిశోధన స్థానం, దర్శి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. వరప్రసాద్ పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పంటలు సాగుచేసే రైతులు వర్షపాతాన్ని బట్టి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. అలాగే ప్రస్తుతం రైతులు సాగు చేసుకునే పంటల్లో జాగ్రత్తలు వహించాలని మండలంలో సాగు చేయబోయే కంది, మినుము పంటలను వర్షం వస్తే ఈ ఆగష్టు చివరివరకు విత్తుకోవచ్చని సూచించారు. వర్షపాతం నమోదు కాకపోతే తక్కువ కాల పరిమితి కలిగిన పప్పు ధాన్యాల పంటలైన మినుము, పెసర, బొబ్బర్లు సాగు చేసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ నీటి సంరక్షణ చేసుకోవాలని, ఉన్న నీటిని సద్వినియోగ పరుచుకోవాలని తెలియజేశారు రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా పప్పు ధాన్యాలు లేదా నూనె గింజల పంటలైన నువ్వుల పంటను సాగు చేసుకొని తెలిపారు. అలాగే పొగాకు పంటకు ప్రత్యామ్నంగా అపరాల సాగుదిశగా రైతులు ఆలోచించాలని అందుకు శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి గుంటూరు లాం, పరిశోధనా స్థానం నుండి శాస్త్రవేత్తలు డాక్టర్ దయానా, డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ ఉమాదేవి పాల్గొని రైతులనుద్దేశించి ప్రస్తుతం పొలంలో సాగు చేసిన పంటల్లో బెట్ట పరిస్థితులు కనిపించినట్లయితే పంటల్లో ఉన్న బెట్టను నివారించుటకు రెండు శాతం యూరియా ద్రావణం లేదా మల్టీకే ద్రావణం పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే వర్షం వస్తే కంది పంటను ఆగష్టు చివరి వరకు సాగుచేసుకోవచ్చని తెలిపారు. బ్రైకోడెర్మావిరిడి ప్రయోజనాలు గురించి దానివలన నివారించే వివిధ రకాల తెగుళ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు శ్రీలేఖ, శ్రీరామ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఎల్‌నీనో ప్రభావంలో సేంద్రియ పద్ధతులు సాగు మంచి ఫలితాలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 13)

మండలంలోని కంబాలపాడు విలేజ్ ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుదర్శన్ రాజ్, ఎస్‌పీఎన్‌యు నుంచి వి విజయ ప్రమీల, పొదిలి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో నవధాన్యాల సాగు ఎల్‌నినో ప్రభావంలో గ్రామంలోని రైతులకు సాగు, పిట్టల గుళికలు తయారు చేయడం గురించి శిక్షణ ఇచ్చి కోటయ్య అనే రైతుతో పిఎండిఎస్ విత్తనాలను విత్తన గుళికలుగా (పేలటైజేషన్) చేసి వేయించడం జరిగింది. ఇలా విత్తన గులకలు చేసి పొలంలో చల్లడం వలన విత్తనాలు పాడవకుండా పక్షులు తినకుండా విత్తనంలోని జీవం చనిపోకుండా ఉంటుందని రైతులకు తెలిపారు. కొద్దిపాటి వర్షం వచ్చినప్పుడు ఇవన్నీ మొలకెత్తుతాయని వివరించడం జరిగింది. బాల గురవయ్య సేంద్రియ ఉత్పత్తులు సెంటర్ సందర్శన చేయడం జరిగింది. ఇందులో కీటక నాశణులు దశపర్ని, వేప గింజల కషాయం, అజ్ఞాస్త్రం, బ్రహ్మాస్త్రం, తెల్ల, పచ్చ దోమలకు ఎల్లో ప్లేట్స్, బ్లూ ప్లేట్స్ ఇవన్నీ చూసి గ్రామంలోని రైతులు ఎలా కొనుగోలు చేస్తున్నారో అడిగి తెలుసుకోవడం జరిగింది. రైతు శ్రీరాములు రెడ్డి ఆకుకూరలు, పచ్చి రొట్టె ఎరువులు, పొలం సందర్శన చేయడం జరిగింది. అంతే కాకుండా రైతులందరికీ నవధాన్యాల సాగు చేయడం వల్ల ఉపయోగాల గురించి వివరించి చెప్పడం జరిగింది. అంతే కాకుండా రైతులను ప్రకృతి వ్యవసాయం గురించి అధికారులు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి పైన తెలిపిన అధికారులతో పాటు ఏపీసీఎన్ఎఫ్, ఎఫ్ఎంటీ మేరీ దేట్టిల్లా, వీవీఏఎస్ గురుబ్రహ్మం, చైతన్య, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రవి కుమార్, ఓనర్ బాల గురవయ్య, రైతులు పాల్గొన్నారు.

## బిడ్డ కోసం తల్లడిల్లిన హృదయాలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే

మార్టూరులో నెలలు నిండని పసికందుకు రూ.1,50,144 సాయం

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఆగస్టు 13)

కడుపులో బిడ్డ కదలికలు మొదలైనప్పటి నుంచి ఆ తల్లిదండ్రుల కళ్లలో వెయ్యి కలలు. కానీ నెలలు నిండకుండానే బిడ్డ జన్మించడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా కంగారు పడింది. మార్టూరు మండలం, మార్టూరు గ్రామానికి చెందిన చుండి జయప్రకాష్, చాందిని దంపతులకు ఐదు రోజుల క్రితం మగశిశువు జన్మించాడు. వైద్యుల సూచన మేరకు నవజాత శిశువును చిలకలూరిపేటలోని వరలక్ష్మి ఆసుపత్రిలో ఇంక్యుబేటర్‌లో ఉంచి చికిత్స చేస్తున్నారు. ఒకవైపు బిడ్డ ఆరోగ్యం కోసం తల్లడిల్లుతూనే, మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న వైద్య ఖర్చులను తలచుకుని ఆ తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. చేతిలో చిల్లిగవ్వ లేని దుస్థితిలో బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్న తపనతో వారు స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆశ్రయించారు. కుటుంబ ఆవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే సాంబన్న ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌వోసీ ద్వారా రూ.1,50,144 చెక్కును తక్షణమే మంజూరు చేయించి, స్వయంగా బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఎమ్మెల్యే సాంబన్న సహాయంతో తమ బిడ్డకు మెరుగైన చికిత్స అందుతుందన్న భరోసాతో ఆ కుటుంబం ఎమ్మెల్యే ఏలూరికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక నాయకులు ఆ చెక్కును కుటుంబ సభ్యులు అందజేశారు.

## మణికేశ్వరంలో ఘనంగా తిరంగా ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 13)

మణికేశ్వరం గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు, స్థానిక ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు కలిసి తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. విద్యార్థులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ సమైక్యత, దేశభక్తి, దేశం పట్ల బాధ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మస్తాన్ వలి, గ్రామ టీడీపీ నేత షేక్ కరిముల్లా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలంలో బోరు వివాదం

## హత్య కేసులో ముగ్గురి అరెస్ట్
## చిన్న, చిన్న గొడవలకు హత్యల వరకు వెళ్లొద్దు
## మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ హెచ్చరిక
## సిఐ రమణారెడ్డి బృందం చాకచక్యంతో నిందితుల అరెస్ట్
## వేట కొడవలి, రెండు బైక్‌లు స్వాధీనం

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 13)**

క్షణికావేశాలు చిన్న, చిన్న భూ వివాదాల వల్ల ప్రాణాలు తీసే స్థాయికి దిగజారవద్దని సమాజంలో శాంతియుత మార్గంలోనే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక డీఎస్పీ ఆఫీస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రెస్ మీట్‌లో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. మైదుకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఖ రమణారెడ్డి నేతృత్వంలోని పోలీస్ బృందం చాకచక్యంగా వ్యవహరించి బోరు వివాదం దారుణ హత్య కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేశారని డీఎస్పీ తెలిపారు. మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ చిన్న, చిన్న విషయాలకు కోపతాపాలకు లోనై హత్యల వరకు వెళ్లడం వల్ల కుటుంబాలు వీధిపాలువుతాయన్నారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాలను నాశనం చేస్తాయి. ఏదైనా వివాదం ఉంటే పోలీస్ స్టేషన్‌ను కానీ, రెవిన్యూ అధికారులను కానీ ఆశ్రయించి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలి తప్ప చేతుల్లోకి చట్టాన్ని తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు. కడప జిల్లా ఎస్పీ షెల్మే నచికేత్ విశ్వనాథ్ సూచనల మేరకు మైదుకూరు డీఎస్పీ పర్యవేక్షణలో సిఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేశారన్నారు. 5.8.2026 సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో మైదుకూరు మండలం గడ్డమాయపల్లె గ్రామ రెవిన్యూ పొలాలలో బోరు వేసుకునే విషయమై వివాదం చెలరేగింది. ఈ క్రమంలో నిందితులు కలసి గడ్డమాయపల్లె గ్రామానికి చెందిన మన్యం బాలసిద్దారెడ్డి అనే వ్యక్తిని వేట కొడవలితో నరికి దారుణంగా హత్య చేసి పరారయ్యారు. ఈ ఘటన పై మైదుకూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితులను గురువారం మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె తండా గ్రామం నుండి భైరవకోనకు వెళ్లే మార్గంలో మైదుకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ప్రత్యేక బృందంతో ఎస్ఐలు చిరంజీవి, వెంకటరమణ, సిబ్బందితో కలిసి ఆపరేషన్ నిర్వహించి చాకచక్యంగా అరెస్ట్ చేశారు. నిందితులు షేక్ అబ్దుల్ రసూల్, షేక్ చాంద్ పీర్, శ్రీరాముల వెంకటయ్యల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఒక వేట కొడవలి, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అతి తక్కువ సమయంలో సిఐ వెంకటరమణ, పోలీస్ సిబ్బంది నవీన్ కుమార్, పక్కీరప్ప, జగదీష్, సుబ్బయ్యలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# అభివృద్ధికి కేరాఫ్‌గా కూటమి ప్రభుత్వం
# నక్కల వీరరాఘవులు

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 13)**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు ప్రభుత్వం మారిందని బాపట్ల జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి నక్కల వీర రాఘవులు అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే రొండేళ్ళా నమ్మకం–అభివృద్ధి–సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కడవకుదురు బూత్ నెంబర్ 267లో జిల్లా కార్యదర్శి నక్కల వీరరాఘవులు అధ్వర్యంలో కూటమి నాయకులు ఇంటిఇంటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు, ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నక్కల వీరరాఘవులు, బూత్ కన్వీనర్ మాదాసు ప్రసాద్, కోటిక ఉదయ్ భాస్కర్, అనంత వెంకటేశ్వరరావు, నామన లక్ష్మణరావు, కేశన బాలయ్య, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
# కందుకూరు వారి సహకారంతో
# పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 13)**

టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), కందుకూరు నందు గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ బ్రాంచ్ ఆఫీస్ కందుకూరు వారి సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగింది. 80 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్టేట్ బ్యాంక్ వారు విద్యాసంస్థలకు మొక్కలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐదు వందల మొక్కలు అందించడం జరిగింది. అందులో భాగంగా కళాశాలలో ఏర్పాటుచేసిన మీయావాకి వనం నందు స్టేట్ బ్యాంక్ రీజినల్ బ్రాంచ్ ఆఫీస్, రీజినల్ మేనేజర్, వి అప్పల రాజు, స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్, శ్రీనివాస్ కళ్యాణ్, మేనేజర్ నాగేంద్ర, కళాశాల ఆవరణలో మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ సహిత కార్యక్రమాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడు తమ సహాయ, సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ తెలియజేశారు. తమ కళాశాలకు, మొక్కలు అందించిన స్టేట్ బ్యాంక్ వారికి కళాశాల ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలియజేశారు. తమ కళాశాల పర్యావరణ పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఆ కార్యక్రమాలకు అందరూ తమ సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం తిరుపతి స్వామి, డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు డాక్టర్ పి రాజగోపాల్, డాక్టర్ ఎన్‌వి శ్రీహరి, డాక్టర్ కెవి పద్మావతి, బి కమల బాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మీయావాకి వనాన్ని కళాశాలలో ఏర్పాటు చేయడానికి సహకరించిన స్కందపురి సేవా సమితి చైర్మన్ పువ్వాడ మౌనిక పాల్గొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ కి ధన్యవాదాలు తెలియజేశారు.

# డీజీ పేటలో వృద్ధురాలు హత్య

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 13)**

సిఎస్‌పురం మండలంలోని డీజి పేట సమీపంలోని పొలంలో బంగారు నగల కోసం పావలి వెంకటసుబ్బమ్మ (65) వృద్ధురాలని కత్తితో దాడి చేసి బంగారు నగలు దోచుకొని పారిపోయిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. డీజి పేటకు చెందిన పావలి వెంకటసుబ్బమ్మ రోజు మాదిరిగా తన పొలంలోని పశువుల మేత గడ్డి తెచ్చేందుకు గురువారం ఉదయం వెళ్లి తెచ్చుకొని మరల మధ్యాహ్నం భోజనం చేసి పశువుల మేత గడ్డి తీసుకొని వస్తుంది. కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలు వెంకటసుబ్బమ్మ పై కత్తులతో దాడి చేసి ఆమె పై ఉన్న బంగారు నగలు దోచుకువెళ్లారు. వెంకటసుబ్బమ్మ ముక్కు పై ఉన్న బంగారం కోసం ముక్కు పై కత్తితో దాడి చేశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఇన్చార్జి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉప్పు శ్రీనివాసులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వృద్ధురాలు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సంఘటన స్థలానికి వెళ్లారు. హత్య జరిగిన సంఘటన స్థలాన్ని కనిగిరి క్లూస్ టీం ఏఎస్ఐ రవి ఆధ్వర్యంలో ఆధారాలను సేకరిస్తున్నారు.

# జాతీయ జెండాలతో కొత్తపట్నంలో భారీ ర్యాలీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 13)**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం కొత్తపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్తపట్నం పోలీస్ స్టేషన్ నుంచి సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్జి రామకృష్ణ, ఎస్ఐ వేముల సుధాకర్‌తో పాటు కొత్తపట్నం తహసీల్దార్, ఎంపీడీఓ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని దేశభక్తిని చాటారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, స్వాతంత్ర్య విలువలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు.

# జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి

## డిసిసి, డిఎల్ఆర్సి బ్యాంకర్ల సమావేశంలో
## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు
## స్మార్ట్ కిచెన్ సేవలో కెనరా బ్యాంకు సహకారం అభినందనీయం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 13)**

జిల్లాలో వ్యవసాయం, సూక్ష్మ చిన్న పరిశ్రమలు, మహిళా స్వయం ఉపాధి, ఆహార శుద్ధి రంగాలకు మరింత ప్రోత్సాహం అందించేలా బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ ప్రధాన బ్యాంకుల రీజనల్ మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకులు, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.30,610 కోట్ల రుణ ప్రణాళికను నిర్దేశించగా, జూన్ 30 నాటికి రూ.10,819.54 కోట్ల రుణాలు అందించి 35.34 శాతం ప్రగతి సాధించినట్లు సమావేశంలో వెల్లడైందన్నారు. ప్రాధాన్యత రంగానికి నిర్దేశించిన రూ.23,744 కోట్ల లక్ష్యంలో రూ.7,518.41 కోట్లు, వ్యవసాయ రంగంలో రూ.18,816 కోట్ల లక్ష్యానికి రూ.5,686.73 కోట్లు రుణాలుగా అందించామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగంలో రూ.4,088 కోట్ల లక్ష్యానికి రూ.1,745.11 కోట్లు రుణాలుగా అందించి 42.68 శాతం ప్రగతి నమోదైందన్నారు.

### ఆహార శుద్ధి రంగం పై ప్రత్యేక దృష్టి

ప్రధానంగా ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా రైతులు, మహిళా సంఘాలు, చిన్న పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఉద్యానవన శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించి ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించి, అర్హులైన వారికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 2026-27 సంవత్సరానికి పిఎంఎఫ్ఎంఈ కింద 115 ఖాతాలకు రూ.8.75 కోట్ల రుణ లక్ష్యం కాగా, పలువురు ఆశక్తిదారుల నుండి అందిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, పోర్టల్‌లో వివరాలను వెంటనే నవీకరించాలని బ్యాంకులకు సూచించారు.

### మహిళా సంఘాలకు రుణాలతో ఉపాధి

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానంలో భాగంగా జిల్లాలో 11,485 సంఘాలకు రూ.1,606.09 కోట్ల మేర సూక్ష్మ రుణ ప్రణాళికలు రూపొందించగా, 5,975 సంఘాలకు రూ.865.60 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 4,976 సంఘాలకు రూ.576.40 కోట్ల రుణాలు పంపిణీ కాగా, 45.53 శాతం ప్రగతి నమోదైందన్నారు. మహిళల ఆధ్వర్యంలోని వ్యాపారాలను ప్రోత్సహించేందుకు 21,736 మంది వ్యాపారవేత్తలకు రూ.305.82 కోట్ల మేర ప్రణాళికలు రూపొందించగా, 7,996 మందికి రూ.134.84 కోట్ల రుణాలు మంజూరయ్యాయన్నారు.

### రైతులకు రుణాలు, బీమా పై అవగాహన పెంచాలి

ఖరీఫ్-రబీ సీజన్లకు రైతులకు పంట రుణాలు, వ్యవసాయ కాలపరిమితి రుణాలు లక్ష్యాలకు అనుగుణంగా అందించాలని కలెక్టర్ సూచించారు. కౌలు రైతులకు పంట సాగు హక్కు కార్డుల ఆధారంగా రుణ సదుపాయం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 2026-27లో స్వల్పకాలిక పంట రుణాల లక్ష్యం రూ.11,630 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.5,780.88 కోట్ల మేర రుణాలు అందించినట్లు తెలిపారు.

### ఆర్థిక అక్షరాస్యతకు విస్తృత కార్యక్రమాలు

ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, పొదుపు, సామాజిక భద్రతా పథకాలు, స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జూన్ 2026 నాటికి జిల్లాలో 1,282 అవగాహన శిబిరాల ద్వారా 31,733 మందికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించినట్లు సమావేశంలో వివరించారు.

### "స్టార్ట్ అప్ కడప" కు సహకారం అందించాలి

జిల్లాలో ప్రారంభ దశకు చేరుకున్న "స్టార్ట్ అప్ కడప" ఎంట్రప్రెన్యూర్ కేంద్రం ద్వారా దాదాపు ఏడాదికి 100 వరకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి ఆయా రంగాల్లో యువతకు నైపుణ్యాలను అందించి ప్రొఫెషనల్ ఎంట్రప్రెన్యూర్లుగా అభివృద్ధి చేసే కార్యక్రమాలపై బ్యాంకర్లు కూడా భాగస్వామ్యం వహించి ఆర్థిక చేయూతను ఇవ్వాలన్నారు.

### స్మార్ట్ కిచెన్ సేవలో కెనరా బ్యాంకు సహకారం అభినందనీయం

ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న స్మార్ట్ కిచెన్లకు కెనరా బ్యాంకు యాజమాన్యం రెండు ఫుడ్ ట్రక్కులను అందించడం అభినందనీయం అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సేవా స్ఫూర్తికి కెనరా బ్యాంకు యాజమాన్యానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. స్మార్ట్ కిచెన్లు, 'స్టార్ట్అప్ కడప' వంటి వినూత్న కార్యక్రమాలు జిల్లాలో ప్రజలకు మరింత మేలు చేసేలా ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ఇతర బ్యాంకుల యాజమాన్యాలు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు, ప్రజలు కలిసి చేయూతనిస్తే కడప అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా నిలవడం ప్రతి సంస్థ సామాజిక బాధ్యత అన్నారు. కెనరా బ్యాంకు చూపించిన ఈ స్ఫూర్తిని ఇతర సంస్థలు కూడా ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముందుగా జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం, డిసిసి, డిఎల్ఆర్సి సమావేశంకు సంబంధించిన అజెండా, వివరాలను, పలుశాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని ఆయా శాఖల అధికారులు కలెక్టర్ కి వివరించారు. ఈ సమావేశంలో యూబీఐ ఎజిఎం లక్ష్మీ తులసి, కెడిసిసి సీఈఓ రాజమణి, ఎస్బిఐ ఆర్ఎం అబ్దుల్ రావుఫ్, రీజర్వ్ బ్యాంక్ ఎల్డిఓ ఎలమంద, ఏపిజిబి కడప ఆర్ఎం శ్రీనివాస్ ప్రసాద్, రాజంపేట ఆర్ఎం రాఘవేంద్ర, డిఆర్డీఏ పిడీ రాజ్యలక్ష్మి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, డీఏవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి రవీంద్ర బాబు, అనుబంధ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకట సుబ్బమ్మకు ఘన నివాళి

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 13)**

మాజీ ఎంపిటిసి వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి తల్లి వెంకట సుబ్బమ్మ ఏరువారిపల్లి మాజీ ఎంపిటిసి దశ దిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్ని)లు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంకా పీసీపల్లి ఎంపిపి జపన్య, పీసీపల్లి మాజీ సొసైటీ చైర్మన్ పోలు జయరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కదిరి పార్థసారథి, కదిరి రమణయ్య, రైతు అధ్యక్షులు ముల్లంగి శ్రీహరిరెడ్డి, జడ్పీటిసి మడతల కస్తూరిరెడ్డి, డాక్టర్ పెరుగు మురళికృష్ణ, డాక్టర్ పొలిమేర మల్లికార్జునరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఫయాజ్, డాక్టర్ విభాగం అధ్యక్షులు ఆవుల కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొని ఆమెకు నివాళులర్పించారు.

## ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడాలి

### ఎంపీపీ వీరనారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 13)**

ప్రతి ఒక్కరూ ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడాలని బి మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పీహెచ్సీ నందు హెచ్డిఎస్ హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశం స్థానిక ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిహెచ్సిలో పనిచేసే వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎవరి డ్యూటీలు వారు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని అలా చేయని యెడల సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే పిహెచ్సిలో మరింత సదుపాయాలు కల్పించాలని, రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వారితో మంచిగా మెలగాలని ఆయన సూచించారు. తాను ఒకటిన్నర నెల మాత్రమే ఎంపీపీ హోదాలో ఉంటానని, తరువాతైనా మాజీ ఎంపీపీ హోదాలో ఇక్కడికి వచ్చి ఆసుపత్రి పనితీరును గమనిస్తానని ఆయన హెచ్చరించారు. ఇదంతా కేవలం మన ఊరి ఆసుపత్రి కాబట్టి, మన ఊరి ప్రజలకు రోగాలు వచ్చినప్పుడు వారికి తగిన సహా యం అందించాలన్నదే నా ధ్యేయమన్నారు.అందువల్ల మన ఊరిలో ఉండే ఆసుపత్రిని మనమందరం బాగు చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీపీ పిహెచ్లోని బాత్రూ ములను, పరిసరాలు, రోగులను అన్ని పరిశీలించి ఇలాగే ఉంచాలని సిబ్బందికి సూచించడం జరిగింది. అలాగే పిహెచ్సిలో రోగులు త్రాగునీటి కై అవసరమగు కూల్ వాటర్ మినరల్ ప్లాంట్‌ను ఉచితంగా అందించేందుకు స్థానిక గ్రామానికి చెందిన ఆవుల దస్తగిరి నాయుడు ముందుకు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డిఎం అండ్‌హెచ్ఓ మల్లేష్ మాట్లాడుతూ ఎంపీపీ చెప్పినట్లు వారం రోజులలో పిహెచ్సిలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు సంపత్ కుమార్, స్థానిక వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్నినో, వర్షాభావ పరిస్థితులు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 13)**

ప్రస్తుత ఎల్నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే కరువు కాటకాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు గురువారం ఒంగోలు పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్‌వి రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే కరువు పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి సద్వినియోగం, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సిహెచ్‌వి రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు మరియు సిబ్బందితో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాం, మండల విద్యాశాఖ అధికారి టి కిషోర్ బాబు, సీనియర్ అధ్యాపకులు తాతయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
12 | 14.0826 శుక్రవారం

# గురుకుల పాఠశాలలో అంతా అపరిశుభ్రతే గురుకులమా..నరక కూపమా అంటున్న అధికారులు

## ఆకస్మిక తనిఖీలో బయటపడ్డ పాఠశాల బండారం

(షణ్ముఖ వెలుగు, బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 13)

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో పాఠశాల డైనింగ్ హాలు ఈగలతో నిండిపోయింది. గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. మల్లేష్, బి.మఠం ఎంపీడీవో రామ చంద్రారెడ్డి కలిసి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. అధికారులు తనిఖీ చేసే సమయానికి విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కానీ డైనింగ్ హాలులో పరిశుభ్రత అస్సలు లేదు. తినే ఆహారం చుట్టూ ఈగలు ముసురుతున్నాయి. పశువుల పాకను తలపించేలా దుర్వాసన, ఈగల మోతతో వాతావరణం కంపు కొడుతోంది. ఈ దృశ్యాన్ని చూసి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “ఇది గురుకులమా లేక నరక కూపమా” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రిన్సిపాల్ పరమేశ్వరుడు మరియు సంబంధిత సిబ్బందిని పిలిచి ఎంపీపీ వీరనారాయణరెడ్డి తీవ్రంగా మందలించారు. పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచనలు చేశారు. అనంతరం ఎంపీపీ సంబంధిత జిల్లా అధికారికి ఫోన్ చేసి పాఠశాలలోని దుస్థితిని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కోట్లు ఖర్చు పెట్టి కట్టిన భవనంలో విద్యార్థుల ఆరోగ్యం గాలికి వదిలేయడంపై తల్లిదండ్రులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పోగొట్టుకున్న రూ.10 లక్షల విలువైన నగల బ్యాగ్ అప్పగింత

### సిసి కెమెరాల ఆధారంగా

### గంటల్లో తేల్చిన ప్రొద్దుటూరు 1టౌన్ పోలీసులు

(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, ఆగస్టు 13)

ఆటోలో ప్రయాణిస్తూ పొరపాటున పడేసుకున్న రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగ్‌ను ప్రొద్దుటూరు 1 టౌన్ పోలీసులు చాకచక్యంగా శోధించి బాధితురాలికి సురక్షితంగా అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక నేతాజీ నగర్‌కు చెందిన ఎస్ కె ప్యారిజాన్ 70 సంవత్సరాల వృద్ధురాలు. గురువారం తన ఇంటి నుంచి ఆటోలో పాత బస్టాండ్‌కు బయలుదేరింది. ప్రయాణంలో ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాల బ్యాగ్ ఆటో నుంచి కింద పడిపోయింది. బస్టాండ్ వద్ద దిగాక బ్యాగ్ లేకపోవడాన్ని గుర్తించిన ఆమె, వెంటనే ప్రొద్దుటూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి ఫిర్యాదు పై తక్షణమే స్పందించిన ఇన్స్పెక్టర్ టివి కొండారెడ్డి ఆదేశాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది లాల్ పీరా, రామచంద్ర, శివకుమార్ విచారణ చేపట్టారు. ఆమె ప్రయాణించిన మార్గంలోని సిసి టీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో టౌన్‌లోని ఆర్ట్స్ కాలేజీ సమీపంలో బ్యాగ్ పడిపోయినట్లు గుర్తించి, దానిని స్వాధీనం చేసుకున్నారు.

బ్యాగ్‌లో భద్రంగా ఉన్న సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు నగలను బాధితురాలు ప్యారిజాన్‌కు పోలీసులు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బంగారాన్ని రికవరీ చేసిన ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఇన్స్పెక్టర్ కొండారెడ్డి అభినందించారు. పోయాయనుకున్న నగలు తిరిగి దక్కడంతో బాధితురాలు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# మైదుకూరులో 19,200 ఓటర్ నోటీసులు ఈఆర్వో మధుసూదన్‌రావు

### అర్హుల ఓటు తొలగించొద్దు..అనర్హులకు చోటివ్వొద్దు

### అధికారులకు ఈఆర్వో, డిప్యూటీ కలెక్టర్ కఠిన ఆదేశాలు

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 13)

మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియ కొనసాగుతోందని నియోజకవర్గ నూతన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ కె మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, బ్రహ్మంగారి మఠం మండలాల్లో పర్యటించి ఓటర్ల నమోదు, మార్పుల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మధుసూదన్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 19,200 నోటీసులు వచ్చాయని, వీటిని సంబంధిత ఓటర్లకు త్వరితగతిన అందజేయాలని అధికారులను ఆదేశించారు. జారీ చేసిన నోటీసులను కేవలం సంబంధిత ఓటరుకు గానీ లేదా వారి కుటుంబ సభ్యులకు మాత్రమే నేరుగా అందజేయాలని స్పష్టం చేశారు. మూడో వ్యక్తికి ఇవ్వడానికి వీల్లేదన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు, అందులో పేర్కొన్న తేదీ, వేదిక వద్ద సంబంధిత (అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) ఎదుట హాజరై తమ ఓటుకు సంబంధించిన సరైన ఆధార పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకూడదు. అదే సమయంలో అనర్హుల ఓటు ఏ ఒక్కటీ జాబితాలో నమోదు కాకుండా పూర్తి పారదర్శకత వహించాలన్నారు. నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్లు, అడిషనల్ ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు.

# తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఆగస్టు 13)

మేదరమెట్ల లోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకంతో అంగనవాడి కార్యకర్తలు, విద్యార్థులతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ రాజ్యలక్ష్మి, ఎమ్మార్వో సుబ్బారెడ్డి, ఎంఈఓ పున్నయ్యలు ముఖ్యఅతిథిగా పాల్గొని త్రివర్ణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన ఊరు వాడల జాతీయ జెండా రెపరెపలాడాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పండగ వాతావరణం లో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లక్ష్మీకాంత్, పాఠశాల హెచ్ఎం అంజినీ దేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల చిన్నారులకు మెరుగైన బోధన అందించడమే జ్ఞాన జ్యోతి లక్ష్యం

### జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెబ్బ వెంకటేశ్వర్లు

(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఆగస్టు 13)

అంగన్వాడి కేంద్రాల చిన్నారులకు మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ఈ జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ నిర్వహించడం జరిగిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెబ్బ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన మర్రిపూడి జడ్పీహెచ్ హైస్కూల్లో జరిగిన మూడవరోజు జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డిఆర్పీలు ప్రసంగిస్తూ చిన్నారుల వయసుకు అనుగుణంగా ఆటలు పాటలు కథలు చిత్రాలు వివిధ కార్యకలాపాల ద్వారా బోధన పద్ధతులను కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్పీలు అశోక్ బాబు, వాసు బాబు, ప్రసాద్‌రావు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో హర్ ఘర్ తిరంగా

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 13)

80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉలవపాడు మండలం నందు హర్గర్ తిరంగా వారోత్సవాల్లో భాగంగా గురువారం హై స్కూల్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి సురేష్ మాట్లాడుతూ ఆగస్టు 15 న ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగరవేయాలని ప్రతి పౌరునిలో దేశ గౌరవాన్ని పెంచే విధంగా జాతీయ స్ఫూర్తి కలిగి ఉండాలని తెలియజేయడమైనది. ఈ ర్యాలీలో మండల తహసిల్దార్ ఏవి రవిశంకర్, మండల విద్యాశాఖ అధికారి 1 పివి రత్నం, ఎంఈఓ 2 పివి రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్, ఎన్ జగదీష్, ఉపాధ్యాయులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడలకు కరేడు విద్యార్థి ఎంపిక

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 13)

ఈ నెల 11న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు జరిగిన అమరావతి ఛాంపియన్స్ అండర్ 17 బాయ్స్ కబడ్డీ సెలక్షన్స్ నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరేడు విద్యార్థి గొల్లపోతు వంశి ఎంపిక కాబడ్డారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసులు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ బాలేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపిక కాబడిన విద్యార్థి 24, 25 తారీకుల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల పిడి శ్రీనివాసులు తెలియజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com